


జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత



రాజమహేంద్రవరం రూరల్, జనవరి13: జిల్లా ప్రజలందరికీ భోగి, మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. దక్షిణ భారతదేశంలో ప్రజలు నిర్వహించుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి. ఈ పర్వదినం ప్రతి ఇంట సిరులు కురిపించాలని, ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వశాఖల సిబ్బంది కూడా శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా సోమవారం స్పందన ఉండదని పేర్కొన్నారు.

పండగొచ్చేసింది!

కాలు దువ్వుతున్న కోళ్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి అంటే పల్లెల నిండా సందడే. ఇంటిల్లపాదీ ఆనందంగా గడిపే పండుగ. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ఎంతో సందడిగా జరుపుకోవడానికి ప్రజలంతా సిద్ధమయ్యారు. కొందరికి కోడిపందాలు లేకపోతే పండగ అనిపించనట్టు అయిపోయింది. చివరకు కోడి పందాలు రాజకీయ నేతల కనుసన్నల్లో జరిగే స్థాయికి చేరిపోయాయి. అసలే రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పందెంరాయుళ్లను సైతం ఆనందపరిచేలా ఇప్పటికే అటు రాజకీయ నాయకులు, ఇటు పోలీసుల అనధికార గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు కనిపిస్తోంది. దీనికి అనుగుణంగానే పందాల బరులు సిద్ధమైపోతున్నాయి. కోర్టులు వద్దన్నా, పోలీసులు అడ్డుకున్నా.. రాజకీయ నేతలు మాత్రం కోడిపందాలకే మొగ్గుచూపుతున్నారు. ఈ పండగ మూడు రోజులు ఎవరు అవునన్నా కాదన్నా కోడి పందాలు ఆగే పరిస్థితి లేదు. జిల్లాలో పోలీసులు మాత్రం పందాలు ఆడనిచ్చేలేదని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇవి నిషేధమని చెబుతున్నారు. కానీ రాజకీయ నేతలు ఈ మూడు రోజులు ఎలాగైనా పందాలాడిస్తామని చెబుతున్నారు. కోడి పందెం అంటే కేవలం రెండు కోళ్ల కొట్టుకోవడం కాదు. దాని ముసుగులో కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగే గుండాటలు, పేకాటలు, మూడు ముక్కాటలు, మద్యం అమ్మకాలు ఇలా అనేక చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు ఆలవాలమవుతాయి. కేవలం కోడిపందాలకు అనుమతి ఇస్తామని చెప్పినా కత్తులు లేకుండా ఆడుకోమని చెప్పినా ఎవరూ ముందుకురారు. గుండాటలు, పేకాటలు తప్పనిసరి. బరుల నిర్వాహకులకు ఆదాయం గుండాటలు, పేకాటల నిర్వహణ వల్లే వస్తుంది. ఒక్కో బరికి రూ.లక్షల ఆదాయం వస్తుంది. అందుకే పందాల ముసుగులో జూదం జరుగుతుంది. వాస్తవానికి సంప్రదాయకంగా కోడి పందాలకు చాలాసార్లు అనుమతిచ్చారు. కానీ దీనిని జూదం చేయడం వల్లే ఇబ్బందవుతోంది. ఇక జిల్లాలో కోడి పందాలకు బరులు సిద్ధమవుతున్నాయి. ఓవక్క పోలీసులు బరులను ధ్వంసం చేస్తున్నా, ఫ్లెక్సీలు కడుతున్నా లెక్కచేసే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలోని అన్ని మండలాల్లో కోడిపందాలు బరులు రెడీ అవుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, గోకవరం, సీతానగరం, రంగం పేట, అనపర్తి, బిక్కవోలు తదితర అన్ని ప్రాంతాల్లో బరులను సిద్ధం చేస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లో కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ పుంజులు కాళ్లు దువ్వుతున్నాయి. భోగి రోజు కాస్త నెమ్మదిగా మొదలైనా రెండో రోజు నుంచి కనుమ వరకూ పందాలు పుంజుకుంటాయని నిర్వాహకులు చర్చించుకుంటున్నారు. మరోపక్క పోలీసులు అవగాహన సదస్సులు పెడుతున్నారు. కోడి పందాలు నిషేధమని, కోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయని, ఎవరైనా ఆడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, యువత ఆడి కేసు నమోదైతే ఉద్యోగ అవకాశాలకు కూడా పోతాయని హెచ్చరిస్తున్నారు.



ఇలా ఒకపక్క పోలీసులు పందాలు ఆడనిచ్చేలేదని పట్టుబడుతుంటే, మరో పక్క రాజకీయనేతలు ప్రభుత్వం నుంచే అనుమతి వస్తుందని, పోలీసులు మౌనం వహించక తప్పదని నిర్వాహకులకు నచ్చచెబుతున్నారు.

పందాలకు సై అంటున్న పందెంరాయుళ్లు

అనపర్తి, జనవరి 13 : సంక్రాంతి సందర్భంగా కోడి పందాలకు పందెంరాయుళ్లు ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఏదిఏమైనా కోడిపందాలు నిర్వహిస్తామంటూ నిర్వాహకులు, జరగనివ్వమంటూ పోలీసుల హెచ్చరికల ఫ్లెక్సీ కడుతూ ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. అనపర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే ఊరి చివర ప్రాంతాల్లో టెంట్‌లను ఏర్పాటు చేయడంతో నిర్వాహకులు కోడి పందాలకు, ఇతర జూద క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ క్షణంలోనైనా పందాలకు అనుమతులు వచ్చాయనే భావనతో నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలోని పొలమూరు, పీరా రామచంద్రపురం గ్రామాల్లో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, గతంలో పందాలు జరిగిన ప్రాంతాల్లోనే కాకుండా అనుమానం ఉన్నచోట్ల బరులు ఏర్పాటుచేయకుండా నిఘా పెట్టామని చెప్పారు.



అనపర్తి మండలం పొలమూరులో కోడిపందాల నిర్వహణకు ఏర్పాట్లు



కోడి పందాల బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జూదం జోలికెళ్తే జైలుకే : ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పండుగ సందర్భంగా కోడి పందాలు, గుండాట, జూదం, అశ్లీల నృత్యాలు తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తే జైలుకు వెళ్లక తప్పదని ఎస్పీ జగదీశ్ ఘాటుగా హెచ్చరించారు. కోడిపందాలు వేయడానికి అనుమతులు వస్తాయంటూ వదంతులు వ్యాప్తిచేసి బరుల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు వచ్చే అవకాశం లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వాహకులతోపాటు పాల్గొన్న వారిపై కూడా కేసులు పెడతామన్నారు. జిల్లాలోని ఇప్పటికే కోడి పందాల బరులను ధ్వంసం చేస్తున్నామని ఆయన చెప్పారు. రెవెన్యూశాఖతో సమన్వయం చేసుకొని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కోడి పందాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడిపందాలు ఆడిన వారిపై కూడా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. చెడు వ్యసనాల దారి పట్టకుండా ముఖ్యంగా యువత సంప్రదాయ వాతావరణంలో సంతోషంగా సంక్రాంతి సంబురాలు చేసుకోవాలని ఎస్పీ కోరారు. బొమ్మూరు పీఎస్ పరిధిలో ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్, సీఐ విజయ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి శాటిలైట్ సిటీలోని కోడిపందాల బరులను, కడియం పీఎస్ పరిధిలో సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ తిలక్ ఆధ్వర్యంలో వీరవరం గ్రామంలో కోడిపందాల కోసం ఏర్పాటుచేసిన టెంట్లను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. త్రీటౌన్ పరిధిలో పందాలు వేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీఐ ప్రసన్నవీరయ్యగౌడ్, నల్లజర్లలో సీఐ దుర్గాప్రసాద్, గోపాలపురం పరిధిలో సీఐ సతీశ్‌కుమార్, కోరుకొండలో ఎస్ఐ శారదా సతీశ్, నిడదవోలులో ఎస్ఐ వి.నాగరాజు ఆయా గ్రామాల్లో తనిఖీలు చేసి ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారని ఎస్పీ చెప్పారు. కోడిపందాలు, జూదాలపై దగ్గరలోని పోలీసులకు లేదా నేరుగా తనకు సమాచారం అందించాలని కోరారు.



రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ దృశ్యం



ఆర్టీసీకి లోకల్ ట్రాఫిక్!

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 13: ఆర్టీసీ లోకల్ ట్రాఫిక్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఆదివారం భోగి పండుగను కన్నవారింట్లో జరుపుకోవడానికి మహిళలంతా తమ భర్త, పిల్లలతో కలసి ప్రయాణమయ్యారు. దీంతో శనివారం రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండక్కి సొంతూర్లకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రయాణికులు పోటెత్తడంతో అధికారులు స్పెషల్ బస్సులు నడపడానికి నానా హైరానా పడ్డారు. ఉదయం నుంచే రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ కనిపించింది. రాత్రి వరకూ కొనసాగింది. రాజమహేంద్రవరంతోపాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి విశాఖపట్నం, విజయవాడ.. అమలాపురం, తుని, జంగారెడ్డిగూడెం, భద్రాచలం, ఏలూరు తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలు పిల్లాపాపలతో తరలిరావడంతో రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. ప్రయాణికులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో విశాఖపట్నం, విజయవాడ రూట్లలో ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతోంది. గత రెండు రోజులుగా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఇప్పటివరకూ షెడ్యూలు బస్సులతోపాటు విశాఖపట్నం, 53 సర్వీసులు, విజయవాడకు 18 సర్వీసులు నడిపినట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. మరోపక్క పాలకొండ, ఇచ్ఛాపురం, పలాస తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి విశాఖపట్నం వరకూ వెళితే అక్కడ నుంచి తమ సొంతూర్లకు సులువుగా చేరుకోవచ్చని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. భోగి పండుగ రోజైన ఆదివారం కూడా రష్ ఎక్కువగానే ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో స్పెషల్ సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కాకినాడ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద భారీ క్యూలు ...

విశాఖపట్నం, విజయవాడ ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు పెద్దసంఖ్యలో బస్సుల కోసం ఎదురుచూస్తూ కనిపించారు. కాకినాడ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద భారీ క్యూలు దర్శనమిచ్చాయి. బస్సు రాగానే పరుగులు పెడుతూ ఎక్కాల్సి వచ్చింది. బస్సులు ఎక్కడానికి, బస్సుల్లో సీటు కోసం తోసుకుంటూ, తొక్కుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధానంగా అమలాపురం వైపు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజమహేంద్రవరం-అమలాపురం రూటులో కేవలం అమలాపురం డిపో నుంచి మాత్రమే బస్సులు నడుపుతారు. దీంతో అమలాపురం, రావులపాలెం వైపు నుంచి బస్సులు వస్తేనే ప్రయాణం సాగించాల్సి రావడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు.



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: జిల్లా ప్రజానీకం భోగభాగ్యాలనిచ్చే భోగి పండగను తొలిరోజు జరుపుకుంటున్నారు. సంక్రాంతి ఆరంభ పండుగగా చేసుకునే ఈ భోగి అంటే పిల్లలతోపాటు పెద్దలకూ ఇష్టమే. కాగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే చాలామంది భోగి మంటలు వేయడం ప్రారంభించేశారు. ఇళ్ల ఎదురుగా, ముఖ్యకూడళ్లలో కలప దుంగలను పేర్చి భారీగా మంటలు వేశారు. ఉదయాన్నే తలస్నానాలు చేసిన భోగి పిడకలను మంటల్లో వేయడం, కొత్త బట్టలతో పండుగ సందడికి నాంది పలకడం ఈ భోగి ప్రత్యేకత. ఇప్పటికే హరిదాసుల సంకీర్తన, గంగిరెద్దుల సందడితో సంక్రాంతి శోభ వాడవాడలా వెల్లివిరుస్తోంది.

పండుగ వేళ మద్యం బాదుడు

- క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 పెంపు

రాజమహేంద్రవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పండుగ వేళ జగన్ ప్రభుత్వం మద్యంపై మళ్లీ బాదేసింది. దీంతో మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవలే ఎక్కువగా విక్రయం జరిగే మద్యంపై ప్రభుత్వం ధరలు పెంచింది. ఒక్కో క్వార్టరు బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 పెరిగింది. ఇప్పుడు సంక్రాంతికి మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయనే ఆలోచనతో గల్లాపెట్టె నింపుకోడానికి తెరతీసింది. ఆదివారం నుంచి రెండు బ్రాండ్లపై ధరలు పెరుగుతున్నాయి. 8పీఎం ఇప్పటి వరకూ ఎంఆర్‌పీ రూ200 ఉంటే 210.. మ్యాజిక్ మూమెంట్ వోడ్కా రూ.190పై రూ.20 పెంచుతున్నారు. రెండు బ్రాండ్లకూ ఇకపై రూ.290 వసూలు చేయనున్నారు. అయితే దీనిపై శనివారం రాత్రి వరకూ అధికారికంగా ఎక్సైజ్ అధికారులకు సమాచారం లేదు. దీంతో పండుగ నేపథ్యంలో మందుబాబులను దోపిడీ చేయడానికి ఎవరు సిద్ధం అవుతున్నారనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పటికే బీర్ల రేట్లు అమాంతం పెరిగిపోయాయి. ఒక్కో బీరు రూ.300 నుంచి రూ.330 వరకూ అమ్ముతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో ఉండకపోవడంతో బార్లలో కొనుక్కోక తప్పని పరిస్థితి సృష్టించారు. ఇప్పుడు మళ్లీ ధరలు పెంచేసింది.

పండుగకు ఊరెళ్తున్నారా?

- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇల్లు భద్రం: ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జనవరి13(ఆంధ్రజ్యోతి): పండుగకు వేరే ఊరు వెళ్లేవాళ్లు పోలీసులు ఉచితంగా అందిస్తున్న లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఉపయోగించుకొని ఇంట్లోని వస్తువులకు రక్షణ కల్పించుకోవాలని ఎస్పీ జగదీశ్ కోరారు. ఈ సర్వీసు కోసం 9493206371, 9908454580 ఫోన్ నంబర్లలో సంప్రదిస్తే సిబ్బంది వచ్చి ఇంట్లో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తారన్నారు. వాటిని పోలీస్ కంట్రోల్ రూంలో నిరంతరం పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. దీంతో చోరీలను అరికట్టవచ్చన్నారు. అలాగే ఆభరణాలు తదితర విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో ఉంచాలన్నారు. బయటి గేటును లోపలి నుంచి లాక్ చేయడం, తాళం కనిపించకుండా కర్టెన్‌ని ఉంచడం, ఇంట్లో ఒకటి రెండు లైట్లు వెలిగి ఉండేట్లు చూసుకోవడం, నమ్మకస్తుడిని వాచ్‌మెన్/సెక్యూరిటీ గార్డుగా ఉంచడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి ఆవరణలో పాలప్యాకెట్లు, దినపత్రికలు, చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. ఊరు వెళ్తున్న, ఎన్ని రోజులు ఇంటి వద్ద ఉండరో వంటి విషయాలను సోషల్ మీడియాలో పోస్టు చేయకపోవడమే మంచిదని తెలిపారు. అలాగే ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే 100కి ఫోన్ చేసి పోలీసు సహాయం పొందాలని ఎస్పీ సూచించారు.



విమానాశ్రయం వద్ద రఘురామకృష్ణంరాజుకు వేసిన పూలదండ

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల సహకారం మరువలేనిది

ఎంపీ రఘురామకృష్ణంరాజు.. విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి13: నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు ఉన్నత న్యాయస్థానం చట్టపరమైన రక్షణ కల్పించడంతో సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా శనివారం మధురపూడి విమానాశ్రయం వద్ద ఆయనకు టీడీపీ, జనసేన నాయకులు స్వాగతం పలికారు. ఆవ భూముల ఉద్యమ నాయకుడు అడపా శ్రీనివాస్ భారీ గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్ల అనంతరం సొంత ప్రాంతానికి రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం తనపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టినప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌బాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు అందించిన సహకారం తన జీవితంలో మర్చిపోలేనిదన్నారు. ప్రజలందరికీ మంచి రోజులు రాబోతున్నాయన్నారు. మధురపూడి విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం ద్వారా భీమవరం పట్టణానికి బయల్దేరిన ఆయనకు అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ నాయకులు మింగి లక్ష్మీనారాయణ, బత్తిన సత్తిబాబు, పలువురు జనసైనికులు, వీర మహిళలు ఉన్నారు.

27న దూబచర్లలో రా. కదలిరా..

చంద్రబాబు నల్లజర్ల మండలం రాక

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన మద్దిపాటి



దూబచర్లలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల, జనవరి 13 : ఈనెల 27న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల విచ్చేస్తున్నారని, రా.. కదలిరా కార్యక్రమానికి ప్రతి కార్యకర్త, నాయకులు, అభిమానులు తరలిరావాలని గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. శనివారం దూబచర్లలో చంద్రబాబునాయుడు ప్రసంగించనున్న బహిరంగ సభ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన వల్ల ప్రజలు విసుగుచెందారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. సైకో జగన్ వింత ప్రవర్తనతో ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన పార్టీల్లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, యాలమాటి శ్రీనివాసరావు, లంకా సత్యనారాయణ, కూచిపూడి భాస్కరావు ఉన్నారు.

జనసేన నేత దుర్గేష్‌కు సతీవియోగం.. పలువురి సంతాపం

(7లో)

ఇదేం 'ఆహారం'

- పండుగ రద్దీ వేళ సందట్లో సడేమియా
- రైల్వే స్టేషనులో నిబంధనల ఉల్లంఘన
- ఆహార పదార్థాలు ఇష్టానుసారం అమ్మకాలు
- కొద్దిరోజుల కిందటే ప్రయాణికులకు అస్వస్థత
- అయినా పరిస్థితిలో మార్పు కానరాని వైనం





ఫుడ్ ట్రాక్ రెస్టారెంట్.. 'ఆహారం' స్టాల్ వద్ద ఈ నెల 3న వివరాలు లేకుండా బిర్యానీ విక్రయాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమండ్రి రైల్వే స్టేషన్లో నిబంధనల ఉల్లంఘనలకు స్టాప్ ఉండడం లేదు. అధికారులు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నామని చెబుతున్నా కొందరు వ్యాపారుల తీరు మారడం లేదు. పండుగ రద్దీలో సందట్లో సడేమియా అనే చందంగా ప్రయాణికులను 'ఆహారం' నిబంధనలను గాలికొదిలేసింది. రైల్వేకు ప్రతి రోజూ అందుతున్న ఫిర్యాదుల్లో ఆహారానికి సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. మార్పు ఆశించి ఫిర్యాదులు చేస్తున్న ప్రయాణికుల ప్రయాస తప్ప ఫలితం కానరావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. వీటిని రాజమండ్రి రైల్వే స్టేషనులో ముఖ్యంగా ఆహార పదార్థాల అమ్మకంలో నిబంధనల పాటింపుపై అంత పట్టింపు లేకపోవడం రుజువు చేస్తోంది. క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్ రాజమండ్రి కేంద్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ ఈ రైల్వే స్టేషనులో 'ఆహారం' నిర్లిప్తత కొట్టొచ్చినట్టు కనబడుతోంది. రాజమండ్రి రైల్వే స్టేషనులో ముగ్గురు, నలుగురు సబ్ కాంట్రాక్టర్ల ద్వారా ఆహారం సరఫరా అవుతోంది. ఇదికాకుండా ఐఆర్‌సీటీసీ నిర్వహణలో ఆహారం ఫుడ్‌ట్రాక్ నడుస్తోంది. స్టేషను ప్రాంగణంలో రైల్ కోచ్ రెస్టారెంట్ ఉంది. రైలు బోగీల్లో, రైలు వద్దకు వెళ్లి అమ్మకాలు సాగించేవాళ్లు స్టేషను బయటి నుంచి వండి తెస్తున్నారు. సమోసా, వెజ్, నాన్‌వెజ్ బిర్యానీ, ఎగ్ బిర్యానీ వీళ్లు అమ్ముతుంటారు. మొదటి ప్లాట్‌ఫాంపై ఉండే ఆహారం ఫుడ్‌ట్రాక్ రెస్టారెంట్‌లో దాదాపు అన్ని రకాల టిఫిన్లతోపాటు బిర్యానీ, పెరుగన్నం, పులిహోర వంటివి విక్రయిస్తున్నారు. ప్లాట్‌ఫాంపై అమ్ముతున్నా నిబంధనల ఉల్లంఘన ఎవరికీ కానరావడం లేదు. ప్రతి ప్యాకెట్‌పై కచ్చితంగా పరిమాణం, తయారీ తేదీ, ధర ఉండి తీరాల్సిందే. సాధారణంగా ఈ వివరాలతో ముద్రించిన స్టిక్కర్లు అంటించడం లేదా రబ్బరు స్టాంపు వేయడం చేస్తుంటారు. కానీ, కొన్ని ప్యాకెట్‌లపై అసలు ఎలాంటి వివరాలు కూడా ఉండడం లేదు. దీంతో ప్యాకెట్‌లో ఆహార పదార్థాలు ఎప్పుడు తయారు చేశారు, రైల్వే నిర్ణయించిన ధర ఎంత, పరిమాణం వంటి వేమీ ఉండడం లేదు. ఇక నాణ్యత గురించి పెద్దగా చెప్పాల్సిన అవసరం లేదు. పులిహోరలో నాలుగు కరివేపాకులు, పసుపు రంగు అన్నం తప్ప ఏమీ కానరావు. డబ్బులు చెల్లించి మరీ రుచి లేని ఆహారం కొనుక్కోవడం ప్రయాణికులకు తప్పడం లేదు. అధికారులు వచ్చినప్పుడు వేయింగ్ మిషన్లు పెట్టి మరీ హడావుడి చేస్తూ మభ్యపెడుతూ ఆ తర్వాత షరా మామూలుగానే ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. రైల్వే ప్రయాణంలో ఆహారం నాణ్యతా ప్రమాణాలతో ఉంటే అద్భుతమే. అలా చేయడానికి రైల్వే అధికారులు గట్టిగానే కృషి చేస్తున్నా పరిస్థితుల్లో మాత్రం చెప్పుకోదగిన మార్పు రావడం లేదు. వ్యాపారస్తులు జరిమానాలైనా చెల్లిస్తున్నారేగానీ తీరు మార్చుకోవడం లేదు. అన్నం విషయంలోనూ అదే తంతు నడుపుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురైనా గుణపాఠం నేర్వడం లేదు. కొద్ది రోజుల కిందట రైలులో విశాఖలో బిర్యానీ కొనుక్కొని తిన్న ప్రయాణికులకు వాంతులు, విరేచనాలు పట్టుకున్నాయి. ఏకంగా 9 మంది అస్వస్థతకు గురయ్యారు. రాజమండ్రి రైల్వే స్టేషనులో దించి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి పంపించారు. సాధారణంగా రైలు వచ్చి ఆగిన తర్వాత దిగి ఆహారం కొనుక్కొని గబగబా రైలు ఎక్కేస్తారు. ఎందుకంటే అధిక శాతం రైళ్లకు ఒకటి నుంచి రెండు నిమిషాల స్టాప్ తప్ప ఎక్కువ సమయం ఉండదు. దీంతో ఆ ప్రయాణికుల పరుగునే ఆసరాగా చేసుకొని వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. రైలులోనూ ఆహార పదర్థాలను విక్రయిస్తున్నారు. కానీ వాటిపై నమ్మకం లేకపోవడంతో కొందరు స్టేషనులో రైలు ఆగిన తర్వాత ప్లాట్‌ఫాంపై ఉన్న రెస్టారెంట్లలో కొనుక్కుంటారు. అయితే ఇక్కడా ఇష్టానుసారం అమ్మేస్తున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే వ్యాపారులు వాదనకు దిగుతున్నారు. వారితో వాదించే సమయం లేకపోవడంతో ప్రయాణికులు పరుగున రైలెక్కుతున్నారు. దీంతో రైలు ప్రయాణంలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆహారం దొరుకుతుందో చెప్పాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఆహారాన్ని దారిలో పెట్టే పనిలో భాగంగా రైల్వే శాఖ సుమారు మూడు నెలల కిందట రైల్వే క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్ అనే పోస్టు సృష్టించి ఉద్యోగిని నియమించింది. ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలను ఆయన తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఆపై తగు చర్యలు తీసుకొని మరోసారి ఆ తప్పు జరగకుండా చూడాలి. మూడుసార్లు అదే తప్పు జరిగితే లైసెన్సు రద్దు చేయడం వరకూ పరిస్థితి వెళుతుంది. కానీ రోజూ నిబంధనల ఉల్లంఘన కళ్లముందే జరుగుతున్నా జరిమానాలతోనే సరిపెడుతున్నారు. మిగతా సరుకులు ఎలా ఉన్నా ఆహార పదార్థాల విషయంలో తీరు మారడం లేదు. కొన్ని స్టాల్స్ వద్ద ఆహార పదార్థాల ఫొటోలు ఆకర్షణీయంగా ఉంటాయే గానీ ధరల పట్టికలు కూడా కానరాకపోవడం గమనార్హం.



సత్యదేవుడి దర్శనానంతరం సమాచార కమిషనర్

సత్యదేవుడి సన్నిధిలో సమాచార కమిషనర్ పూజలు

అన్నవరం, జనవరి 13: సత్యదేవుడి సన్నిధిలో శనివారం సమాచార హక్కుచట్టం కమిషనర్ కె.చెన్నారెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

గోవిందనామస్మరణతో మార్మోగిన వెంకన్న ఆలయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, జనవరి 13: అశేషభక్తజన గోవిందనామస్మరణ నడుమ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులతో మార్మోగింది. శనివారం వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల ఫలపుష్పాలతో స్వామివారి ఆలయాన్ని అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులభారాలు, తలనీలాలు, కానుకులు సమర్పించారు. అశేషభక్తజనం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.29.36 లక్షలు లభించినట్టు ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



వాడపల్లి స్వామివారిని దర్శించుకుంటున్న ఇంటెలిజెన్స్ చీఫ్ అజాద్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దాపురం, జనవరి 13: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారి దర్శనానికి భక్తులు తెల్లవారు జాము నుంచే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,19,360 అన్నదాన విరాళాలు రూ.47,122 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.4,240 వెరసి రూ.1,70,722 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పులి నారాయణమూర్తి తెలిపారు. సుమారు 6వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు.

రఘురామకృష్ణంరాజుకు ఘనస్వాగతం



రావులపాలెం కళావెంకట్రావు సెంటర్‌లో ఎంపీ రఘురామకృష్ణంరాజును గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రావులపాలెం, జనవరి 13: రావులపాలెంలో నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు. నాలుగు సంవత్సరాల తర్వాత స్వగ్రామం వెళుతున్న ఆయన శనివారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో విమానం దిగి రోడ్డుమార్గం గుండా బయలుదేరారు. దీంతో రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకున్న ఆయ నకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, టీడీపీ యువనాయకుడు బండారు సంజీవ్‌తో పాటు టీడీపీ, జనసేన నాయకులు చేరుకుని గజమాలతో సత్కరించారు. ఇందులో భాగంగా సతీష్‌రాజు రఘురామకృష్ణంరాజుకు సంక్రాంతి సందర్భంగా కోడిపుంజును అందించారు.

కాపులకు 75 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

- కాపునాడు జాతీయ అధ్యక్షుడు రమేష్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కాపునాడు జాతీయ అధ్యక్షుడు రమేష్ నాయుడు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో కాపులకు 75 అసెంబ్లీ స్థానాలు, 8 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని కాపునాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తాడివాక రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల జనాభా దామాషా 27 శాతం ప్రకారం అన్ని రాజకీయపార్టీలు సీట్లు కేటాయించాలని, నామినేటెడ్ పోస్టులతో పాటు అన్నిరంగాల్లో ప్రాతినిధ్యం కల్పించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. రాజ్యాధికారంలో వాటా పొందడంతో పాటు రెండేళ్ల పవర్ షేరింగ్ విధానంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టి తీరాలని డిమాండ్ చేశారు. కాపునాడు రాష్ట్ర కన్వీనర్ సిద్దా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ ఎవ్వరితో పొత్తుపెట్టుకున్నా అభ్యంతరంలేదుకానీ అంతి మంగా ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 6 అసెంబ్లీ స్థానాలు, 1 ఎంపీ స్థానాన్ని, ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో 7 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒక్కొక్క పార్లమెంట్, 5 అసెంబ్లీ స్థానాలు, రాయలసీమలో 5 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాన్ని కాపులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కాపునాడు పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటుచేసి తిరుపతి కేంద్రంగా కార్యాచరణ చేసేందుకు చర్యలు ప్రారంభిస్తున్నామన్నారు. సమావేశంలో కాపునాడు నాయకులు పెదిరెడ్డి మహేష్, వంగా ఆంజనేయులు, నల్లమిల్లి సత్యనారాయణ, వి.శ్రీదేవి, గంటా దివాకర్, జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత దుర్గేష్‌కు సతీవియోగం

- పలువురు నేతల సంతాపం



కందుల ఉషారాణి (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల లక్ష్మీదుర్గేష్‌కు సతీవియోగం సంభవించింది. ఆయన భార్య కందుల ఉషారాణి(53) కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉషారాణి భౌతికకాయం రాత్రి రాజమహేంద్రవరం చేరుకుంది. ఆదివారం ఉదయం 10గంటలకు ఇన్నీసుపేట కైలాసభూమిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం ఉదయమే దుర్గేష్‌కు ఫోనుచేసి పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, టీడీపీ నాయకులు గన్నికృష్ణ, ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వై.శ్రీను, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావులు ఉషారాణి మృతి పట్ల సంతాపం తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం

- నాయకుల పేర్లపై వివాదం ● ఆవిష్కరణ సమయంలోనే శిలాఫలకం మాయం



అనపర్తిలో వివాదాస్పదంగా మారిన అంబేడ్కర్, పూలే విగ్రహాల ప్రాంగణం, విగ్రహ శిలాఫలకం ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ శివగణేష్

అనపర్తి జనవరి 13: అనపర్తి కెనాల్ రోడ్డులో ఇటీవల ప్రారంభమైన బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాల శిలాఫలకాలు వివాదాస్పదంగా మారాయి. శుక్రవారంరాత్రి దుండగులు అంబేడ్కర్ విగ్రహానికి ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. గత నెల 30న అంబేడ్కర్, పూలే విగ్రహాల ప్రారంభోత్సవానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేసి పూలే విగ్రహానికి ప్రారంభకులు ఎంపీ భరత్‌రామ్, శిలాఫలక ఆవిష్కరణ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పేర్లను, అంబేడ్కర్ విగ్రహానికి ప్రారంభకులు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, శిలాఫలకం ఆవిష్కరణ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్లను ఏర్పాటు చేశారు. అయితే ప్రారంభోత్సవం ముందురోజు రాత్రి అంబేడ్కర్ విగ్రహంవద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకం మాయమైంది. మాజీ ఎమ్మెల్యే పేరు ఉన్నందునే దానిని మాయం చేశారని ఒక వర్గం ఆరోపించింది. దీంతో శిలాఫలకం ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటుచేసి ప్రారంభోత్సవం పూర్తిచేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి శిలాఫలకం ఏర్పాటుచేశారు. అయితే దానిని శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేయడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి శిలాఫలకం ధ్వంసమైన ప్రాంతం లో ప్లాస్టిక్ కవర్‌ను కప్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటుచేశారు. కాగా శిలాఫలకం ధ్వంసంపై నల్లా చిన్నారావు, పచ్చిమళ్ల వెంకటరమణ విడివిడిగా ఫిర్యాదులు చేశారని, కోర్టు అనుమతితో కేసులు నమోదు చేస్తామని సీఐ చెప్పారు.

జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల విన్నర్‌గా జగన్



జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ విజేతగా నిలిచిన కోనసీమ జిల్లాకు చెందిన జగన్



బాడీబిల్డింగ్ పోటీల విజేతలకు షీల్డులు అందజేసిన డీఎస్పీ అంబికాప్రసాద్

అమలాపురంటౌన్, జనవరి13: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో గోదావరి జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం అర్ధరాత్రి వరకు నిర్వహించారు. ఆయా పోటీల విజేతల వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు శనివారం ప్రకటించారు. కోనసీమ జిల్లాకు చెందిన ఎం.జగన్ టైటిల్ విన్నర్‌గాను, కాకినాడ జిల్లాకు చెందిన టి.ప్రశాంత్ రన్నర్‌గాను నిలిచారు. కాకినాడజిల్లా టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గాను, కోనసీమజిల్లా రన్నర్‌గాను నిలిచిం దన్నారు. బహుమతి ప్రధానోత్సవ సభకు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 160 మంది బాడీబిల్డర్లు 12 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. 55కిలోల విభా గంలో కె.ప్రసాద్(కాకినాడ), 60 కిలోల విభాగంలో ఎం.జగన్ (కోనసీమ), 65కిలోల విభాగంలో కె.సిద్దు(కాకినాడ), 70కిలోల విభాగంలో ఎన్.రోహిత్(కోనసీమ), 75కిలోల విభాగంలో టి.ప్రశాంత్ (కాకినాడ), 75కిలోల పైబడిన విభాగంలో డి.శ్రీను (కాకినాడ)లు విజేతలుగా నిలిచారు. మాస్టర్స్ విభాగంలో టి.అబ్బులు(కోనసీమ), దివ్యాంగ విభాగంలో జి.మోషే(ఏలూరు), ఫిజిక్ స్పోర్ట్స్ 165 సెంటీమీటర్ల బిలో కేటగిరిలో కె.సాయిగణేష్ (పశ్చిమగోదావరి), 165 సెంటీమీటర్ల పైబడిన విభాగంలో సీహెచ్ ఇళయరాజా(కాకినాడ)లు ప్రథమస్థానాలు సాధించారు. వారికి డీఎస్పీతోపాటు జనసేన పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, ఆఫీసర్స్ క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, పవన్‌లిఫ్టింగ్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, జంప న సుమన్‌వర్మ, లింగోలు పండులతోపాటు అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ విజేత పిల్లి వందనలు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

చదువులమ్మ చెట్టు నీడన..

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మోరి హైస్కూలులో కలిసిన 1979-84 పూర్వ విద్యార్థులు

అంతర్వేది, జనవరి 13: నాలుగు దశాబ్దాల క్రితం సరస్వతీ నిలయ మైన ఆ చదువులమ్మ చెట్టు నీడన చదువుకున్న పూర్వ విద్యార్థులంతా అదే పాఠశాలలో మరోసారి కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. సఖినేటిపల్లి మండలం మోరి జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో 1979-84లో 6 నుంచి పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డా తిరిగి అదే చదువులమ్మ ఒడిలో బుద్ధిగా ఒదిగిపోయారు. అలనాటి మధుర స్మృతులను తలుచు కుని విద్యార్థులుగా మారిపోయి సందడి చేశారు. అలనాటి తరగతి గదుల్లో తిరుగుతూ సందడి చేశారు. తొలుత అలనాటి విద్యార్థులు కామిశెట్టి మాచరమ్మ, పడవల కోట సూర్యకు మారి, నిమ్మగడ్డ ఝాన్సీ, గుత్తి సుబ్బలక్ష్మి, సరెళ్ల పద్మ, భాగ్యలక్ష్మి తదితరులు జ్యోతి ప్రజ్వలనచేసి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు డాక్టర్ ఆకుల వెంకట రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. పూర్వ విద్యార్థుల పరిచయం అనంతరం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కోలాటం ఆడారు. సంక్రాంతి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు రాపాక పెద్దిరాజు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు, శ్రీపాద వెంకటేశ్వర్లు, పసలపూడి శ్రీనివాసరావు, గానాల వెంకటా చార్యులు, బళ్ల మహాత్మాగాంధీ, కాశిన సూరన్న పాల్గొన్నారు. కుమార్తె వర్షితతో కలిసి తండ్రి శ్రీపాద వెంక టేశ్వర్లు చేసిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. జంటకవులు పసలపూడి శ్రీనివాసరావు, గోళ్ల ప్రకాష్‌లను సత్కరించారు. నిర్వాహకులతో పాటు విదేశాల నుంచి వచ్చిన మేకలలక్ష్మి, గెడ్డం రాజబాబు, నల్లి జనార్థనరావులను సత్కరించారు.

మకరదర్శనం కోసం ద్వారపూడి అయ్యప్ప ఆలయం ముస్తాబు

- గురుస్వామి ఎస్‌ఎల్ కనకరాజు



మండపేట, జనవరి 13: ఆంధ్ర శబరిమలైగా పిలువబడే ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి దర్శనం కోసం ఏర్పాట్లను చేస్తున్నామని ఆలయ ట్రస్టీ ఎస్.ఎల్. కనకరాజు గురుస్వామి వెల్లడించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ద్వారపూడి అయ్యప్పస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న సోమవారం ఉదయం 4.30నుంచి ప్రారంభమయ్యే మహాగణప తిహోమం, 6గంటలకు స్వామివారికి ఇరుముడి అభిషేకం, 8.30కు స్వామివారి రథం, స్వామివారి ఆభరణాల పెట్టెను రాయవరం మండలం మాచవరానికి చెందిన కర్రి ఆదిరెడ్డి శిరస్సుపై ఉంచి గ్రామంలో గ్రామోత్సవం ఊరేగింపు, జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం 4గంటలకు, ఆలయ ప్రాంగణంలో ఉన్న దేవతామూర్తులు విగ్రహాలకు ఆభరణాలు విశేష పూజలు, పుష్పాలంకరణ, జరుగు తాయన్నారు. సాయంత్రం ఆలయంవద్ద కొమరిపాలెం వారిచే భారీగా బాణాసంచా కాలుస్తారన్నారు. అనంతర సాయంత్రం 6.30కు మకరజ్యోతి(కర్పూరనీరాజనం) మంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని గురుస్వామి కనకరాజు భక్తులకు పిలుపునిచ్చారు.

ధర్మమంటే ఒక మతం కాదు..

- పరిపూర్ణానందసరస్వతి స్వామిజీ



ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతి స్వామిజీ, చిత్రంలో రాంమాధవ్

అమలాపురం రూరల్, జనవరి 13: భారతీయ సనాతన ధర్మం విశ్వ వ్యాప్తమని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతిస్వామిజీ పేర్కొన్నారు. ధర్మమంటే ఒక మతంకాదని గుర్తించాలన్నారు. ఈదరపల్లిలో సేవాభారతి, రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో నిర్మించిన జనహిత కార్యాలయం అదనపు భవనాన్ని శనివారం ఆర్‌ఎస్‌ఎస్ అఖిలభారత కార్యకారిణి సదస్యులు వారణాసి రాంమాధవ్‌తో కలిసి స్వామిజీ ప్రారంభించారు. సేవాభారతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా తొలుత ముఖ్యఅతిథులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామిజీ గోపూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యవక్తగా సహక్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్ హాజరై ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. ముఖ్య అతిథులు రాంమాధవ్ మాట్లాడుతూ అయోధ్యలో ఈనెల 22న రామ మందిరంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో భారతీయుల్లో స్థిరప్రతిష్ఠ జరుగుతుందన్నారు. పరిపూర్ణానంద సరస్వతిస్వామి మాట్లాడుతూ సేవా భారతి, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన అమలాపురంలో జనహిత కార్యాలయాన్ని నిర్మించడం అద్భుతమన్నారు. మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) తనవంతుగా ఆర్థిక సాయాన్ని ప్రకటించి జనహిత ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల ను ప్రశంసించారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంపర్క్ బులుసు జగదీష్, రాష్ట్ర అధ్యక్షుడు సుంకవిల్లి రామకృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర విభాగ్ ప్రము ఖులు డాక్టర్ గోదశి గంగరాజు, శ్రీరామచంద్రరాజు, ఓలేటి సత్యనారాయణ, సోమశేఖర్, జీవీఎస్ కామేశ్వరరావు, వాసంశెట్టి బలరా మకృష్ణ, అమ్మిరాజుతోపాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం, జనవరి 13: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న 13వ ఆలిండియా 19వ ఆంధ్రప్రదేశ్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్, రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఓపెన్ కేటగిరీలో నిర్వహిస్తున్న ఈ పోటీలను లీగ్, నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. పురుషుల విభాగంలో రామచంద్రపురం ఎ జట్టు ఖమ్మంజట్టుపై 75-47 పాయింట్‌లతోనూ హైదరాబాద్ డిఫెన్స్ జట్టు, కాకినాడ డీఎస్‌ఎ జట్టుపై 41-10, ఆట్లేరీ జట్టు సామర్లకోటపై 45-22, డీబీఏ జట్టు హైదరాబాద్ జట్టు జి.మామిడాడపై 55-48 కమర్షియల్ టాక్స్ అండ్ ఎక్సైజ్ జట్టు ఏపీఎస్‌పీ కాకినాడ జట్టుపై 60-42, డీఎస్‌ఎ కాకినాడ జట్టు హైదరాబాద్ సెయింట్‌పై 53-42 రాజమండ్రి సీబీఏ జట్టు రామచంద్రపురం బి జట్టుపై 44-23, అనంతపురం జట్టు సామర్లకోట జట్టుపై 32-20, గుంటూరు జట్టు ఏపీఎస్‌పీ కాకినాడ జట్టుపై 55-47 పాయింట్లతో గెలుపొందినట్లు రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. మహిళల విభాగంలో చత్తీస్‌గడ్ జట్టు మేరీ స్టెల్లా జట్టుపై 42-10, డిఫెన్స్ హైదారాబాద్ జట్టు కాకినాడ డీఎస్‌ఏ జట్టుపై పై 41-10 విజయవాడ సీబీఏ జట్టు అమలాపురంపై 26-10, రామచంద్రపురం జట్టు అమలాపురంపై 45-7, డీబీఏ హైదరాబాద్ జట్టు విజయవాడ స్టెల్లా జట్టుపై 31-8, ఏలూరుజట్టు కాకినాడ డీఎస్‌ఏ జట్టుపై 29-4 పాయింట్లతో గెలుపొందినట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గన్నమని తెలిపారు. బాస్కెట్ బాల్ రామచంద్రపురం అధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్, జె.దుర్గాప్రసాద్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల బాలుడి మృతి

- అపస్మారక స్థితిలో భార్య
- భర్త, మరో కుమారుడికి తీవ్ర గాయాలు



గొల్లప్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌ను ఢీకొట్టిన కారు

గొల్లప్రోలు, జనవరి 13: కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రెండేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, భార్య అపస్మారక స్థితిలో చేరుకోగా, మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన తీరు చూపరులను కన్నీరు పెట్టించింది. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన సీహెచ్.వెంకటరమణ తన సతీమణి గౌతమి, కుమారులు దుర్గాప్రసాద్, శ్రీచైతన్యలతో కలిసి శనివారం అన్నవరం వెళ్లారు. సత్యదేవుని దర్శనం అనంతరం అక్కడే భోజనంచేసి మోటార్‌సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. కోటనందూరు మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన వ్యక్తులు కారులో వెళ్తూ గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో పెట్రోల్‌బంకు జంక్షన్ వద్ద వెనుక నుంచి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో రెండేళ్ల శ్రీచైతన్య అక్కడికక్కడే మరణించాడు. గౌతమి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంకటరమణ, బాలుడు దుర్గాప్రసాద్‌లకు తీవ్రగాయాలయ్యాయి. తన తమ్ముడు శ్రీచైతన్య చనిపోవడం, తల్లి గౌతమి చలనం లేకుండా పడి ఉండటంతో దుర్గాప్రసాద్ విలపిస్తున్న తీరు అందరికంట కన్నీరు తెప్పించింది. వెంకటరమణ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేస్తున్నారు. గాయపడిన వారిని హైవే మొబైల్ సిబ్బంది తొలుత పిఠాపురం, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో అపస్మారకస్థితిలో ఉన్న భార్య, తీవ్రంగా గాయపడ్డ, భర్త, కుమారుడు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

మోతుగూడెం జలపాతాల వద్ద పర్యాటకుల సందడి



పర్యాటకులతో రద్దీగా ఉన్న మోతుగూడెం రోడ్డు

మోతుగూడెం, జనవరి 13: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పలు పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. వరుస సెలవులు రావడంతో పలు ప్రాంతాల నుంచి టూరిస్టులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లని మంచు పడుతుండగా ఆ చలిగాలలో తెల్లవారుజామున నాలుగు గంటలకే పర్యాటక ప్రాంతాలకు చేరుకుని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించి పరవశించిపోయారు. మోతుగూడెం, పొల్లూరు, ఫోర్‌బై, డొంకరాయి ఉన్న జలపాతాలను అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. దీంతో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో వాహనాలతో రావడంతో మోతుగూడెం, పొల్లూరు జాతీయ రహదారిలో కొంత ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. జలపాతం వద్ద పర్యాటకులు కేరింతలతో ఉల్లాసంగా జలకాలాడారు. రోజంతా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆటపాటలతో గడిపారు. తులసిపాక వ్యూ పాయింట్ వద్ద ప్రకృతి అందాలు మంచు సోయగాలు తిలకించి పర్యాటకులు పరవశించిపోయారు.

ఇందుకూరుపేటలో సంక్రాంతి సంబరాలు

దేవీపట్నం, జనవరి 13: మండలంలోని ఇందుకూరుపేటలో సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్నారు. మండలంలో ఉన్న ప్రతీఒక్కరూ హాజరుకావాలని అమ్మ స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపకురాలు గారపాటి వరలక్ష్మి దంపతులు పిలుపునిచ్చారు. ప్రతీఏటా నిర్వహించే సంబరాలు ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు. ఈ సంబరాలలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తారని ఆసక్తిగల వారు పాల్గొనాలని తెలిపారు.

ఆర్గనైజ్డ్ గుండాటలకు రంగం సిద్ధం

- గ్రామాల్లో కమిటీలకి లక్షల్లో కప్పం చెల్లింపు
- కన్నెత్తి చూడని పోలీసు, రెవెన్యూ యంత్రాంగం

కోరుకొండ, జనవరి 13: సంక్రాంతి సంప్రదాయ కోడిపందాలు భారీస్థాయిలో గుండాట, పేకాట, ఇతర జూదాలకు నిర్వాహకులు తెరలేపారు. ఈ మేరకు మండలంలోని ఎప్పుడూలేని విధంగా ఆర్గనైజ్డ్ గ్యాంబలింగ్‌కు భారీ స్థాయిలో గ్రౌండ్ సిద్ధం చేశారు. టెంట్‌లు, జనరేటర్లు, విద్యుత్ సౌకర్యాలు వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో పందాలకు బరులు సిద్ధం చేశారు. ఒక్కో గ్రామంలో రూ.5 నుంచి రూ.20 లక్షల వరకు నిర్వాహకులు స్థానిక కమిటీలకు కప్పం కట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో పందెగాళ్లను గుండాట,పేకాటదారులకు సమాచారం ఇచ్చి సంక్రాంతికి పండుగ రంగ ప్రవేశంచేసేందుకు సర్వంసిద్ధం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ రోడ్ల ప్రక్కన జన సంచారం జరిగే ప్రాంతాల్లో ఏ మాత్రం జంకుబంకు లేకుండా పోలీసు యంత్రాంగం చూస్తారన్న భయం లేకుండా నిర్వాహకులు యథేచ్ఛగా కాలర్ ఎగురవేస్తూ గ్యాంబలింగ్‌కు సిద్ధ మవుతున్నారు. ఇంత జరుగుతున్న పోలీసులు ఆయా బరులవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలే ఎన్నికల సంవత్సరం కావడంతో మామూలుగా ఒక కత్తితో దూసుకుపోతున్న కోడి ఈ ఏడాది రెండు కత్తులతో దూసుకుపోతుంది. ప్రతి గ్రామంలోను కనీసం 4నెంబరు గుండు బోర్డులు ఏర్పాటు చేశారు.

జియోన్ అంధుల పాఠశాల కూల్చివేత దారుణం

- జేటీ రామారావు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: రాజమహేంద్రవరం జియోన్ అంధుల పాఠశాల కూల్చివేసి అంధవిద్యార్థులను బయటకు గెంటివేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జేటీ రామారావు విమర్శించారు. శనివారం ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉన్న అంధ విద్యార్థులను ఆయన పరామర్శించారు. జియోన్ పాఠశాలను దారుణంగా వైసీపీ నాయకులు కూల్చివేశారని దీనిపై ఆరోగ్యశాఖకుగాని, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ నుంచి కానీ, ఆరోగ్యశాఖ మంత్రి నుంచి కానీ ఎలాంటి ఉత్వర్వులు ఇవ్వకుండా స్థలాన్ని స్వాధీనం చేసుకోవడాన్ని నిలదీశారు. ఇందులో డీఈవోకి సంబంధం ఏమిటని, కలెక్టర్ ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. జియోన్ అంధుల పాఠశాల విద్యార్థులకు న్యాయం జరిగేవరకు పోరాడతామని ప్రకటించారు.

రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ రోజు సెలవు ప్రకటించాలి

- వరల్డ్ హిందూ ఫెడరేషన్ రాష్ట్రాధ్యక్షుడు ప్రసాద్



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: అయోధ్య రామమందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ జరిగే రోజు ఈనెల 22న రాష్ట్రంలో సెలవు దినంగా ప్రకటించాలని వరల్డ్ హిందూ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పొడుగు వెంకట సత్యానారాయణ ప్రసాద్ అచార్యులు, విశ్వహిందూ మహాసంఘ్ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు శ్రీకృష్ణ చరణానంద భారతీ స్వామిజీ కోరారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. భారత దేశంలో ధర్మ ప్రతిష్ఠాపన జరగాలని కోరుకుంటున్న 120 దేశాల ప్రతినిధులు ఆ రోజున అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి విచ్చేస్తారని అలాంటి పవిత్రమైన రోజును సెలవు దినంగా ప్రకటించడం సముచితంగా ఉంటుందని వారన్నారు. ఈ మేరకు సీఎం జగన్‌ను కలిసి విన్నవిస్తామని వారు చెప్పారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: దేశానికి ఆదర్శంగా విజయవాడలో ఏర్పాటుచేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కుల, మత,ప్రాంతీయ భేదాలు లేకుండా తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం జరుగుతుందని, అలాగే అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కైలైటింగ్, ఫౌంటెన్లు, మూడువేల మంది కూర్చునే మల్టీపర్పస్ కన్వెన్షన్ హాలు, 2వేల మంది కూర్చునే ఓపెన్ థియేటర్, పదివేల పుస్తకాలతో కూడిన లైబ్రరీ, అంబేడ్కర్ చరిత్రను భావి తరాలకు తెలియజేసేవిధంగా గొప్పకళాఖండాలను సీఎం జగన్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను పండుగ వాతావరణంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎం.సందీప్, ఎస్సీఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, జైభీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కె.భానుచందర్, ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్, దళిత మహిళా అధ్యక్షురాలు పి.బేబిప్రశాంతి, దళిత నాయకుడు వి.యేసు, సుందరపల్లి అనిల్, నక్క విజయ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

నేడు ధవళేశ్వరంలో 'స్వచ్ఛ భోగి'

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 13: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలోని ధవళేశ్వరంలో స్వచ్ఛత-బాధ్యత కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభోగిని నిర్వహిస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం 7గంటలకు నియోజకవర్గంలోని అన్నిగ్రామాలు, మునిసిపల్ కార్పొరేషన్ డివిజన్లలో పారిశుధ్య కార్మికుల సేవలకు సన్మాన కార్యక్రమం చేస్తున్నామని చెప్పారు. ధవళేశ్వరంలోని జక్కంపూడి కళ్యాణ మండపంలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తామన్నారు.

సంక్రాంతి ముందస్తు సంబరాలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 13: సంక్రాంతి ముందస్తు సంబరాలు పలుచోట్ల శనివారం జరిగాయి. తెలుగు సంస్కృతిలోని శాంతి, సామరస్య భావనలు నేటి తరానికి తెలియజెప్పాలనే ఉద్దేశ్యంతోనే ప్రతిఏటా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్టు రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. శనివారం రాజమహేంద్రవరం మున్సిపల్ కాలనీ మైదానంలో రాజమహేంద్రి విద్యాసంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలను ఎంపీ మార్గాని భరత్‌రామ్ వెలిగించారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ పీవోలు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువులోని బాల వికాస్ మందిర్ స్కూల్లో సంక్రాంతి ఉత్సవాల్లో విద్యార్థులంతా సాంప్రదాయ వస్త్రధారణలతో ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. అలాగే చిన్నారులకు భోగి పండ్లు పోసి, భోగి పిడకలను మంటల్లో వేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, బొల్లేపల్లి వీరభద్రరావు, వంక మల్లిబాబు, పాఠశాల కరస్పాండెంట్ యర్రంశెట్టి



రాజానగరంలో విక్రయానికి ఉంచిన ఆవుపిడకలు, పూలు, రేగిపండ్లు

నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం 4వ డివిజన్ రాజేంద్రనగరం 12 కూళాయిల సెంటర్‌లో టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగాయి. దీనికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుతులను అందించారు. సంక్రాంతి వేడుకలను అందరు ఉత్సాహంగా జరపుకోవాలన్నారు. పోటీలను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, షేక్ సుభాన్, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, దొండపాటి సత్యంబాబు, యాళ్ళ శ్రీను, చాపల చిన్నరాజు, కర్రి మహేంద్రవర్మ పాల్గొన్నారు.

కోరుకొండ: జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నాలుగు చోట్ల సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అగ్రహారం వీధిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా 8గ్రాములు, రెండో బహుమతిగా 5గ్రాములు, మూడో బహుమతిగా 3గ్రాముల బంగారాన్ని ప్రకటించారు. పోటీల్లో పాల్గొన్న వారికి హాట్‌బాక్స్‌లను జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ అందజేశారు. అలాగే రాజానగరం, సీతానగరం, దివాన్‌చెరువు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు 8,5,3 గ్రాముల బంగారాన్ని ప్రకటించారు. ఇదిలా ఉండగా వైసీపీ ఆధ్వర్యంలో మధురపూడి, నిడిగట్ల గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వాషింగ్ మిషన్, మిక్సీ, డిన్నర్‌సెట్లను జక్కంపూడి విజయలక్ష్మి అందజేశారు. అనంతరం గంగిరెద్దుల ఆట, భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ గణేశుల పోశియ్య, యడ్ల సత్యనారాయణ, యడ్ల సురేష్ పాల్గొన్నారు.



రాజమహేంద్రి కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినులు



రాజమహేంద్రవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మార్కెట్లో సంక్రాంతి శోభ

రాజానగరం, జనవరి 13: మండల కేంద్రమైన రాజానగరం మార్కెట్ శనివారం సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఆదివారం భోగి పండుగ కాడంతో చిన్నారులకు భోగిపండ్లు పోసేందుకు(రేగుపండ్లు), ఆవుపేడ పిడకలు దండలు, చెరుకు గెడలు, పలు రకాల పండ్లు, బంతి, చామంతి, గులాబి తదితర వివిధ రకాల పుష్పాలతో రాజానగరంలోని దుకాణాలు రద్దీగా మారాయి. ధరలు ఆకాశన్నంటడంతో వీటిని కొనుగోలు చేసేందుకు సామాన్యులు విలవిలలాడిపోతున్నారు.

మా వ్యాపారం సంగతి నీకెందుకు

ఎంపీ భరత్‌కు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి ప్రశ్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: తమ వ్యాపారాల గురించి మీకేందుకు అని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నేత ఆదిరెడ్డి అప్పారావు.. ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను ప్రశ్నించారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరిలో శనివారంజరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ భరత్ తనకు బిడ్డలాంటివాడని కాని ఇటీవల హద్దులు దాటి వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నాడని, అందుకు తగిన విధంగా పాఠం చెప్పడానికి ఆధారాలతో సిద్ధమౌతున్నామని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, రాజకీయలు, అభివృద్ధిపై మాట్లాడితే సహేతుకంగా సమాధానం చెబుతామని, కాని తమ వ్యాపారాల గురించి ఆయనకెందుకని మండిపడ్డారు. తాను రూ.3 వడ్డీ తీసుకుంటున్నట్టు నిరూపిస్తే వ్యాపారం మూసివేస్తానన్నారు. రూ.500 జీతానికి అధ్యాపకుడిగా పనిచేశానని, సైకిల్ తొక్కానని, తన ముందు భరత్ అనుభవం ఎంతని ప్రశ్నించారు. అనంతరం జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ జియోన్ సంస్థలను నిర్వీర్యం చేయడం, నగరంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులు, మునిసిపాలిటి నిధులు కేటాయింపులు, ఆర్‌సీఆర్ వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం వంటి పలు విషయాలపై ప్రశ్నలు సంధించారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, బుడ్డిగ రాధా, శెట్టి జగదీష్, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, యిన్నమూరి రాంబాబు, మిస్కా జోగినాయుడు, జనసేన నాయకులు గుత్తుల సత్యనారాయణ, నల్లంశెట్టి వీరబాబు, గుణ్ణం శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కియా సోనెట్ ద వైల్డ్ రీబోర్న్ కారు విడుదల



కారు విడుదల చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 13: కియా సోనెట్ ద వైల్డ్ రీబోర్న్ న్యూవెర్షన్ కారును ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, కాకినాడ మార్కెట్‌లోకి వచ్చింది. ఈ మేరకు శనివారం కాకినాడలోని కంటిపూడి కియా షోరూమ్‌లో కంటిపూడి గ్రూప్ చైర్మన్ కంటిపూడి సర్వారాయుడు ఈ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ జీఎం కామేష్ మాట్లాడుతూ సరికొత్త కియా సోనెట్‌ని ఆరు ఎయిర్ బ్యాగ్స్ స్టాండర్డ్, రోబస్ట్, 15 స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్, అడ్వాన్స్డ్ ఏడీఏఎస్ 10 ఆటోనమస్ ఫీచర్స్, ఫ్యూచరిస్టిక్, డిజిటల్ స్క్రీన్, క్లస్టర్, స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫైర్, 360 డిగ్రీ కెమెరా, అత్యాధునిక స్మార్ట్ టెక్ 70 కియా కనెక్ట్ ఫీచర్స్‌తో పెట్రోల్, డీజిల్ ఆప్షన్స్‌తో అందుబాటులోకి వచ్చిన ఈ కారు బుకింగ్స్ ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కె.వినయ్‌బాబు, ఎం.జగన్, సీహెచ్.సత్యనారాయణమూర్తి, కె.మన్మోహన్‌రామ్ పాల్గొన్నారు.

రైతులకు మోటార్లు పంపిణీ



రైతులకు మోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట, జనవరి 13: మండలంలో వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా మంజూరైన బోర్ మోటార్లను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 87 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో బోరు వేసుకున్న ప్రతి రైతుకి సుమారు రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కొల్లాటి ఇశ్రాయేలు, నల్లా శ్రీనివాస్, పోతుల బులివీర్రాజు, పాలాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో సీసీ రోడ్డుకు భూమిపూజ

బిక్కవోలు, జనవరి 13: కొమరిపాలెం లాకుల వద్ద నిర్మించనున్న సీసీ రోడ్డుకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఎంపీటీసీ గంగాభవాని, సొసైటీ చైర్మన్ చినబుజ్జి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సత్తి హరిప్రసాదరెడ్డి, రొంగల అప్పాజీ పాల్గొన్నారు.

రంగాపురంలో శ్రీరామ స్పర్శ అక్షింతలు పంపిణీ



బిక్కవోలు, జనవరి 13: రంగాపురంలో శనివారం అయోధ్య నుంచి తీసుకు వచ్చిన శ్రీరామ స్పర్శ అక్షింతలను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు ఇంటింటికీ పంపిణీ చేశారు. 500 ఏళ్ల హిందువుల కల నెరవేరబోతుందని, ఈనెల 22న అక్షింతలతో ప్రతిఒక్కరూ ఆశీర్వచనాలు పొంది, ఇళ్లల్లో ఐదు దీపాలు వెలిగించాలని ఆయన పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన మాజీ ఎంపీ మురళీమోహన్



మాగంటి మురళీమోహన్‌కు మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

కడియం, జనవరి 13: కడియపులంక సత్యదేవానర్సరీని శనివారం సినీనటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు(అబ్బులు) మొక్కను అందజేసి స్వాగతం పలికారు. మురళీమోహన్ నర్సరీలో వివిధ రకాల మొక్కలను, సంక్రాంతి సందర్భంగా మొక్కలతో తీర్చిదిద్దిన ఆకృతులను తిలకించారు. మొక్కలు, వాటి శాస్త్రీయనామాలను అబ్బులు తనయులు వీరబాబు, రాజశేఖర్‌లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని రకాల మొక్కలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పలువురు నర్సరీరైతులు పాల్గొన్నారు.

కొత్త కోటపాడులో హోమియో వైద్య శిబిరం

రంగంపేట, జనవరి 13: మండలంలోని కొత్త కోటపాడు శ్రీసత్యసాయి సేవాసదన్లో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని తలంచి ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. రాజమహేంద్రవరం శ్యామ్ హేమియోకేర్ డాక్టర్ శ్యామ్‌కుమార్‌వైష్ణవ్ పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు నర్ల శ్రీనివాస్, శిరిగిన వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉషారాణి మృతికి నల్లమిల్లి సంతాపం

అనపర్తి, జనవరి 13: జనసేన పార్టీ ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌చార్జి కందుల దుర్గేష్ సతీమణి ఉషారాణి మృతి పట్ల టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, దుర్గేష్ కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని కోరుతున్నానన్నారు.

షర్మిళారెడ్డిని కలిసిన హౌసింగ్ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన మేడపాటి షర్మిలారెడ్డిని జిల్లా హౌసింగ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం హౌసింగ్ ఈఈ రాజ్‌కుమార్, రూరల్ డీఈ బీవీవీ సత్యనారాయణమూర్తి, నిడదవోలు డీఈ చంద్రశేఖర్, అనపర్తి డీఈ సీహెచ్ వేణుగోపాల్, రాజానగరం డీఈ ఆర్.వెంకటేశ్వర బాబు, కొవ్వూరు డీఈ ఎం.శ్రీనివాస్, గోపాలపురం డీఈ కె.శేఖర్‌బాబు, ఏఈ కేఎస్ చక్రవర్తి.. షర్మిళారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బలహీన వర్గాల సంక్షేమానికి టీడీపీ కృషి



నిడదవోలు, జనవరి 13: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసింది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలులోని నందిని ఆడిటోరియమ్‌లో తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన టౌన్‌హాల్ విత్ లీడర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఐటీ ప్రొఫెషనల్స్ అడిగిన పలు సమస్యలపై సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి పనులు ప్రారంభించామని, ఇప్పుడున్న సంక్షేమ పథకాల కన్నా ఎన్నో రెట్ల ఎక్కువ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే ఇవ్వగలుగుతామన్నారు. పట్టణంలోని ఆర్వోబీ నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే శ్రీకారం చుట్టామని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌గా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, సింహాద్రి రామకృష్ణ, అతికాల రామకృష్ణమ్మ, టీడీపీ ప్రొఫెషనల్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుటూరి కొండయ్యచౌదరి, పలువురు ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలి: ఎస్పీ



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ జగదీశ్

కడియం, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూద క్రీడల వైపు కాకుండా సాంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ తిలక్ పర్యవేక్షణలో కడియం పోలీస్‌స్టేషన్ వద్ద రెండు రోజుల పాటు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. యువత జూదాలకు దూరంగా ఉండాలని, క్రిమినల్ కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్‌లో ఉద్యోగవకాశాలు కోల్పోతారన్నారు. కోచ్ ఎన్వీ భద్రంను సత్కరించారు.

విజేతలు వీరే.. బీజీ సాయి, పి.ప్రవీణ్ (కాకినాడ), జీసాయి మనీష్, ఎస్‌కే నవాబుల్లా(కాకినాడ), జీవీ చైతన్య కె.చైతన్య(రాజమహేంద్రవరం), నున్నా సూర్య, తోట స్వామి (వేమగిరి), గోరు బాబు, సాయి(కడియపులంక), వెంకట్, శ్రీధర్(ధవళేశ్వరం), అంజి, బాబీ(కడియం) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్, ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

బలభద్రపురంలో ఘనంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి చక్ర స్నానానికి బిందెలతో జలాలు తెస్తున్న ముత్తయిదువులు

బిక్కవోలు, జనవరి 13: బలభద్రపురంలో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి నిర్వహిస్తున్న స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో గ్రామం మార్మోగింది. ఉదయం స్వామి అమ్మవార్లకు పండితులు సుప్రభాత సేవ, తోమాల సేవ జరిపారు. తిరుపతి నుంచి తీసుకొచ్చిన పంచెను కొవ్వూరి సతీష్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు స్వామికి అందజేశారు. 108 మంది ముత్తయిదువులు కోనేరు నుంచి తీసుకొచ్చిన జలాలతో స్వామికి చక్రస్నానం జరిపారు. ఆపై పూర్ణాహుతి, గోదాదేవి కల్యాణం నిర్వహించారు. మండ వెంకటరెడ్డి, బృందావతి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీప్రభావతి దంపతులు రూ.24 లక్షలతో తయారు చేయించిన రథంపై స్వామి అమ్మవార్లను పురవీధులగుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలోని కోనేరులో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం జరిపారు. పండిత సత్కారాలతో కార్యక్రమాలు ముగించారు.



కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

దేవరపల్లి ట్రైనీ డీఎస్పీ భానోదయ

దేవరపల్లి, జనవరి 13: కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరపల్లి ట్రైనీ డీఎస్పీ భానోదయ, ఎస్ఐ శ్రీహరిరావు హెచ్చరించారు. మండలంలోని శనివారం దేవరపల్లి, యర్నగూడెం, చిన్నాయిగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించే ప్రదేశాలు గుర్తించామని, కొన్ని చోట్ల పందేలకు సిద్ధం చేస్తున్న బరులు ధ్వంసం చేశామని, కోడిపందేల నిషేధ బోర్డులు ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, గుండాట, పేకాట, మద్యం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత



రాజమహేంద్రవరం రూరల్, జనవరి13: జిల్లా ప్రజలందరికీ భోగి, మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. దక్షిణ భారతదేశంలో ప్రజలు నిర్వహించుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి. ఈ పర్వదినం ప్రతి ఇంట సిరులు కురిపించాలని, ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వశాఖల సిబ్బంది కూడా శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా సోమవారం స్పందన ఉండదని పేర్కొన్నారు.

పండగొచ్చేసింది!

కాలు దువ్వుతున్న కోళ్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి అంటే పల్లెల నిండా సందడే. ఇంటిల్లపాదీ ఆనందంగా గడిపే పండుగ. భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ఎంతో సందడిగా జరుపుకోవడానికి ప్రజలంతా సిద్ధమయ్యారు. కొందరికి కోడిపందాలు లేకపోతే పండగ అనిపించనట్టు అయిపోయింది. చివరకు కోడి పందాలు రాజకీయ నేతల కనుసన్నల్లో జరిగే స్థాయికి చేరిపోయాయి. అసలే రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పందెంరాయుళ్లను సైతం ఆనందపరిచేలా ఇప్పటికే అటు రాజకీయ నాయకులు, ఇటు పోలీసుల అనధికార గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు కనిపిస్తోంది. దీనికి అనుగుణంగానే పందాల బరులు సిద్ధమైపోతున్నాయి. కోర్టులు వద్దన్నా, పోలీసులు అడ్డుకున్నా.. రాజకీయ నేతలు మాత్రం కోడిపందాలకే మొగ్గుచూపుతున్నారు. ఈ పండగ మూడు రోజులు ఎవరు అవునన్నా కాదన్నా కోడి పందాలు ఆగే పరిస్థితి లేదు. జిల్లాలో పోలీ సులు మాత్రం పందాలు ఆడనిచ్చేలేదని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇవి నిషేధమని చెబుతున్నారు. కానీ రాజకీయ నేతలు ఈ మూడు రోజులు ఎలాగైనా పందాలాడిస్తామని చెబుతున్నారు. కోడి పందెం అంటే కేవలం రెండు కోళ్ల కొట్టుకోవడం కాదు. దాని ముసుగులో కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగే గుండాటలు, పేకాటలు, మూడు ముక్కాటలు, మద్యం అమ్మకాలు ఇలా అనేక చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు ఆలవాలమవుతాయి. కేవలం కోడిపందాలకు అనుమతి ఇస్తామని చెప్పినా కత్తులు లేకుండా ఆడుకోమని చెప్పినా ఎవరూ ముందుకురారు. గుండాటలు, పేకాటలు తప్పనిసరి. బరుల నిర్వాహకులకు ఆదాయం గుండాటలు, పేకాటల నిర్వహణ వల్లే వస్తుంది. ఒక్కో బరికి రూ.లక్షల ఆదాయం వస్తుంది. అందుకే పందాల ముసుగులో జూదం జరుగుతుంది. వాస్తవానికి సంప్రదాయకంగా కోడి పందాలకు చాలాసార్లు అనుమతిచ్చారు. కానీ దీనిని జూదం చేయడం వల్లే ఇబ్బందవుతోంది. ఇక జిల్లాలో కోడి పందాలకు బరులు సిద్ధమవుతున్నాయి. ఓపక్క పోలీసులు బరులను ధ్వంసం చేస్తున్నా, ఫ్లెక్సీలు కడుతున్నా లెక్క చేసే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలోని అన్ని మండలాల్లో కోడిపందాలు బరులు రెడీ అవుతున్నాయి. రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, గోకవరం, సీతానగరం, రంగం పేట, అనపర్తి, బిక్కవోలు తదితర అన్ని ప్రాంతాల్లో బరులను సిద్ధం చేస్తున్నారు. కొవ్వూరు డివిజన్‌లో కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ పుంజులు కాళ్లు దువ్వుతున్నాయి. భోగి రోజు కాస్త నెమ్మదిగా మొదలైనా రెండో రోజు నుంచి కనుమ వరకూ పందాలు పుంజుకుంటాయని నిర్వాహకులు చర్చించుకుంటున్నారు. మరోపక్క పోలీసులు అవగాహన సదస్సులు పెడుతున్నారు. కోడి పందాలు నిషేధమని, కోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయని, ఎవరైనా ఆడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, యువత ఆడి కేసు నమోదైతే ఉద్యోగ అవకాశాలకు కూడా పోతాయని హెచ్చరిస్తున్నారు.



ఇలా ఒకపక్క పోలీసులు పందాలు ఆడనిచ్చేలేదని పట్టుబడుతుంటే, మరో పక్క రాజకీయనేతలు ప్రభుత్వం నుంచే అనుమతి వస్తుందని, పోలీసులు మౌనం వహించక తప్పదని నిర్వాహకులకు నచ్చచెబుతున్నారు.

పందాలకు సై అంటున్న పందెంరాయుళ్లు

అనపర్తి, జనవరి 13 : సంక్రాంతి సందర్భంగా కోడి పందాలకు పందెం రాయుళ్ల ఏర్పాట్లు శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఏదిఏమైనా కోడిపందాలు నిర్వహిస్తామంటూ నిర్వాహకులు, జరగనివ్వమంటూ పోలీసుల హెచ్చరికల ఫ్లెక్సీ కడుతూ ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. అనపర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే ఊరి చివర ప్రాంతాల్లో టెంట్‌లను ఏర్పాటు చేయడంతో నిర్వాహకులు కోడి పందాలకు, ఇతర జూద క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏ క్షణంలోనైనా పందాలకు అనుమతులు వచ్చాయనే భావనతో నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలోని పొలమూరు, పీరారామచంద్రపురం గ్రామాల్లో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామారావు మాట్లాడుతూ కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, గతంలో పందాలు జరిగిన ప్రాంతాల్లోనే కాకుండా అనుమానం ఉన్నచోట్ల బరులు ఏర్పాటుచేయకుండా నిఘా పెట్టామని చెప్పారు.



అనపర్తి మండలం పొలమూరులో కోడిపందాల నిర్వహణకు ఏర్పాట్లు



కోడి పందాల బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు

జూదం జోలికెళ్తే జైలుకే : ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పండుగ సందర్భంగా కోడి పందాలు, గుండాట, జూదం, అశ్లీల నృత్యాలు తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తే జైలుకు వెళ్లక తప్పదని ఎస్పీ జగదీశ్ ఘాటుగా హెచ్చరించారు. కోడిపందాలు వేయడానికి అనుమతులు వస్తాయంటూ వదంతులు వ్యాప్తిచేసి బరుల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు వచ్చే అవకాశం లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వాహకులతోపాటు పాల్గొన్న వారిపై కూడా కేసులు పెడతామన్నారు. జిల్లాలోని ఇప్పటికే కోడి పందాల బరులను ధ్వంసం చేస్తున్నామని ఆయన చెప్పారు. రెవెన్యూశాఖతో సమన్వయం చేసుకొని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కోడి పందాలు జరిగే ఆస్కారం ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడిపందాలు ఆడిన వారిపై కూడా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. చెడు వ్యసనాల దారి పట్టకుండా ముఖ్యంగా యువత సంప్రదాయ వాతావరణంలో సంతోషంగా సంక్రాంతి సంబురాలు చేసుకోవాలని ఎస్పీ కోరారు. బొమ్మూరు పీఎస్ పరిధిలో ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్, సీఐ విజయ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి శాటిలైట్ సిటీలోని కోడిపందాల బరులను, కడియం పీఎస్ పరిధిలో సౌత్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ తిలక్ ఆధ్వర్యంలో వీరవరం గ్రామంలో కోడిపందాల కోసం ఏర్పాటుచేసిన టెంట్లను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. త్రీటౌన్ పరిధిలో పందాలు వేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీఐ ప్రసన్నవీరయ్యగౌడ్, నల్లజర్లలో సీఐ దుర్గాప్రసాద్, గోపాలపురం పరిధిలో సీఐ సతీశ్‌కుమార్, కోరుకొండలో ఎస్‌ఐ శారదా సతీశ్, నిడదవోలులో ఎస్‌ఐ పి.నాగరాజు ఆయా గ్రామాల్లో తనిఖీలు చేసి ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారని ఎస్పీ చెప్పారు. కోడిపందాలు, జూదాలపై దగ్గరలోని పోలీసులకు లేదా నేరుగా తనకు సమాచారం అందించాలని కోరారు.



రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ దృశ్యం



ఆర్టీసీకి లోకల్ ట్రాఫిక్!

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 13: ఆర్టీసీ లోకల్ ట్రాఫిక్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఆదివారం భోగి పండుగను కన్నవారింట్లో జరుపుకోవడానికి మహిళలంతా తమ భర్త, పిల్లలతో కలసి ప్రయాణమయ్యారు. దీంతో శనివారం రాజమహేంద్రవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ప్రయాణికులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండక్కి సొంతూర్లకు వెళ్లేందుకు ఆర్టీసీ ప్రయాణికులు పోటెత్తడంతో అధికారులు స్పెషల్ బస్సులు నడపడానికి నానా హైరానా పడ్డారు. ఉదయం నుంచే రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ కనిపించింది. రాత్రి వరకూ కొనసాగింది. రాజమహేంద్రవరంతోపాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి విశాఖపట్నం, విజయవాడ.. అమలాపురం, తుని, జంగారెడ్డిగూడెం, భద్రాచలం, ఏలూరు తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలు పిల్లాపాపలతో తరలి రావడంతో రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. ప్రయాణికులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో విశాఖపట్నం, విజయవాడ రూట్లలో ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతోంది. గత రెండు రోజులుగా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఇప్పటివరకూ షెడ్యూలు బస్సులతోపాటు విశాఖపట్నం, 53 సర్వీసులు, విజయవాడకు 18 సర్వీసులు నడిపినట్టు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. మరోపక్క పాలకొండ, ఇచ్ఛాపురం, పలాస తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి విశాఖపట్నం వరకూ వెళితే అక్కడ నుంచి తమ సొంతూర్లకు సులువుగా చేరుకోవచ్చని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. భోగి పండుగ రోజైన ఆదివారం కూడా రష్ ఎక్కువగానే ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో స్పెషల్ సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కాకినాడ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద భారీ క్యూలు ...

విశాఖపట్నం, విజయవాడ ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు పెద్దసంఖ్యలో బస్సుల కోసం ఎదురుచూస్తూ కనిపించారు. కాకినాడ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద భారీ క్యూలు దర్శనమిచ్చాయి. బస్సు రాగానే పరుగులు పెడుతూ ఎక్కాల్సి వచ్చింది. బస్సులు ఎక్కడానికి, బస్సుల్లో సీటు కోసం తోసుకుంటూ, తొక్కుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధానంగా అమలాపురం వైపు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజమహేంద్రవరం-అమలాపురం రూటులో కేవలం అమలాపురం డిపో నుంచి మాత్రమే బస్సులు నడుపుతారు. దీంతో అమలాపురం, రావులపాలెం వైపు నుంచి బస్సులు వస్తేనే ప్రయాణం సాగించాల్సి రావడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు.



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: జిల్లా ప్రజానీకం భోగభాగ్యాలనిచ్చే భోగి పండగను తొలిరోజు జరుపుకుంటున్నారు. సంక్రాంతి ఆరంభ పండుగగా చేసుకునే ఈ భోగి అంటే పిల్లలతోపాటు పెద్దలకూ ఇష్టమే. కాగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచే చాలామంది భోగి మంటలు వేయడం ప్రారంభించేశారు. ఇళ్ల ఎదురుగా, ముఖ్యకూడళ్లలో కలప దుంగలను పేర్చి భారీగా మంటలు వేశారు. ఉదయాన్నే తలస్నానాలు చేసిన భోగి పిడకలను మంటల్లో వేయడం, కొత్త బట్టలతో పండుగ సందడికి నాంది పలకడం ఈ భోగి ప్రత్యేకత. ఇప్పటికే హరిదాసుల సంకీర్తన, గంగిరెద్దుల సందడితో సంక్రాంతి శోభ వాడవాడలా వెల్లివిరుస్తోంది.

పండుగ వేళ మద్యం బాదుడు

- క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 పెంపు

రాజమహేంద్రవరం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పండుగ వేళ జగన్ ప్రభుత్వం మద్యంపై మళ్లీ బాదేసింది. దీంతో మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవలే ఎక్కువగా విక్రయం జరిగే మద్యంపై ప్రభుత్వం ధరలు పెంచింది. ఒక్కో క్వార్టరు బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 పెరిగింది. ఇప్పుడు సంక్రాంతికి మద్యం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయనే ఆలోచనతో గల్లాపెట్టె నింపుకోడానికి తెరతీసింది. ఆదివారం నుంచి రెండు బ్రాండ్లపై ధరలు పెరుగుతున్నాయి. 8పీఎం ఇప్పటి వరకూ ఎంఆర్‌పీ రూ.200 ఉంటే 210.. మ్యాజిక్ మూమెంట్ వోడ్కా రూ.190పై రూ.20 పెంచుతున్నారు. రెండు బ్రాండ్లకూ ఇకపై రూ.290 వసూలు చేయనున్నారు. అయితే దీనిపై శనివారం రాత్రి వరకూ అధికారికంగా ఎక్సైజ్ అధికారులకు సమాచారం లేదు. దీంతో పండుగ నేపథ్యంలో మందుబాబులను దోపిడీ చేయడానికి ఎవరు సిద్ధం అవుతున్నారనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పటికే బీర్ల రేట్లు అమాంతం పెరిగిపోయాయి. ఒక్కో బీరు రూ.300 నుంచి రూ.330 వరకూ అమ్ముతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో ఉండకపోవడంతో బార్లలో కొనుక్కోక తప్పని పరిస్థితి సృష్టించారు. ఇప్పుడు మళ్లీ ధరలు పెంచేసింది.

పండుగకు ఊరెళ్తున్నారా?

- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇల్లు భద్రం: ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, జనవరి13(ఆంధ్రజ్యోతి): పండుగకు వేరే ఊరు వెళ్లేవాళ్లు పోలీసులు ఉచితంగా అందిస్తున్న లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఉపయోగించుకొని ఇంట్లోని వస్తువులకు రక్షణ కల్పించుకోవాలని ఎస్పీ జగదీశ్ కోరారు. ఈ సర్వీసు కోసం 9493206371, 9908454580 ఫోన్ నంబర్లలో సంప్రదిస్తే సిబ్బంది వచ్చి ఇంట్లో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తారన్నారు. వాటిని పోలీస్ కంట్రోల్ రూంలో నిరంతరం పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. దీంతో చోరీలను అరికట్టవచ్చన్నారు. అలాగే ఆభరణాలు తదితర విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో ఉంచాలన్నారు. బయటి గేటును లోపలి నుంచి లాక్ చేయడం, తాళం కనిపించకుండా కర్టెన్‌ని ఉంచడం, ఇంట్లో ఒకటి రెండు లైట్లు వెలిగి ఉండేట్లు చూసుకోవడం, నమ్మకస్తుడిని వాచ్‌మెన్/సెక్యూరిటీ గార్డుగా ఉంచడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి ఆవరణలో పాలప్యాకెట్లు, దినపత్రికలు, చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. ఊరు వెళ్తున్న, ఎన్ని రోజులు ఇంటి వద్ద ఉండరో వంటి విషయాలను సోషల్ మీడియాలో పోస్టు చేయకపోవడమే మంచిదని తెలిపారు. అలాగే ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే 100కి ఫోన్ చేసి పోలీసు సహాయం పొందాలని ఎస్పీ సూచించారు.



విమానాశ్రయం వద్ద రఘురామకృష్ణంరాజుకు వేసిన పూలదండ

చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల సహకారం మరువలేనిది

ఎంపీ రఘురామకృష్ణంరాజు.. విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం

కోరుకొండ, జనవరి13: నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు ఉన్నత న్యాయస్థానం చట్టపరమైన రక్షణ కల్పించడంతో సంక్రాంతి పండుగకు స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా శనివారం మధురపూడి విమానాశ్రయం వద్ద ఆయనకు టీడీపీ, జనసేన నాయకులు స్వాగతం పలికారు. ఆవ భూముల ఉద్యమ నాయకుడు అడపా శ్రీనివాస్ భారీ గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్ల అనంతరం సొంత ప్రాంతానికి రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం తనపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టినప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌బాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు అందించిన సహకారం తన జీవితంలో మర్చిపోలేనిదన్నారు. ప్రజలందరికీ మంచి రోజులు రాబోతున్నాయన్నారు. మధురపూడి విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం ద్వారా భీమవరం పట్టణానికి బయల్దేరిన ఆయనకు అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో టీడీపీ నాయకులు మింగి లక్ష్మీనారాయణ, బత్తిన సత్తిబాబు, పలువురు జనసైనికులు, వీర మహిళలు ఉన్నారు.

27న దూబచర్లలో రా. కదలిరా..

చంద్రబాబు నల్లజర్ల మండలం రాక

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన మద్దిపాటి

నల్లజర్ల, జనవరి 13 : ఈనెల 27న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల విచ్చేస్తున్నారని, రా.. కదలిరా కార్యక్రమానికి ప్రతి కార్యకర్త, నాయకులు, అభిమానులు తరలిరావాలని గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. శనివారం దూబచర్లలో చంద్రబాబునాయుడు ప్రసంగించనున్న బహిరంగ సభ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన వల్ల ప్రజలు విసుగుచెందారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. సైకో జగన్ వింత ప్రవర్తనతో ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు టీడీపీ, జనసేన పార్టీల్లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, పసుమర్తి రతీష్, యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, యాలమాటి శ్రీనివాసరావు, లంకా సత్యనారాయణ, కూచిపూడి భాస్కరావు ఉన్నారు.



దూబచర్లలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మద్దిపాటి వెంకట్రాజు

జనసేన నేత దుర్గేష్‌కు సతీవియోగం.. పలువురి సంతాపం

ఇదేం 'ఆహారం'

- పండుగ రద్దీ వేళ సందట్లో సడేమియా
- రైల్వే స్టేషనులో నిబంధనల ఉల్లంఘన
- ఆహార పదార్థాలు ఇష్టానుసారం అమ్మకాలు
- కొద్దిరోజుల కిందటే ప్రయాణికులకు అస్వస్థత
- అయినా పరిస్థితిలో మార్పు కానరాని వైనం





ఫుడ్ ట్రాక్ రెస్టారెంట్.. 'ఆహారం' స్టాల్ వద్ద ఈ నెల 3న వివరాలు లేకుండా బిర్యానీ విక్రయాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమండ్రి రైల్వే స్టేషన్లో నిబంధనల ఉల్లంఘనలకు స్టాప్ ఉండడం లేదు. అధికారులు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నామని చెబుతున్నా కొందరు వ్యాపారుల తీరు మారడం లేదు. పండుగ రద్దీలో సందట్లో సడేమియా అనే చందంగా ప్రయాణికులను 'ఆహారం' నిబంధనలను గాలికొదిలేసింది. రైల్వేకు ప్రతి రోజూ అందుతున్న ఫిర్యాదుల్లో ఆహారానికి సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. మార్పు ఆశించి ఫిర్యాదులు చేస్తున్న ప్రయాణికుల ప్రయాస తప్ప ఫలితం కానరావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. వీటిని రాజమండ్రి రైల్వే స్టేషనులో ముఖ్యంగా ఆహార పదార్థాల అమ్మకంలో నిబంధనల పాటింపుపై అంత పట్టింపు లేకపోవడం రుజువు చేస్తోంది. క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్ రాజమండ్రి కేంద్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ ఈ రైల్వే స్టేషనులో 'ఆహారం' నిర్లిప్తత కొట్టొచ్చినట్టు కనబడుతోంది. రాజమండ్రి రైల్వే స్టేషనులో ముగ్గురు, నలుగురు సబ్ కాంట్రాక్టర్ల ద్వారా ఆహారం సరఫరా అవుతోంది. ఇదికాకుండా ఐఆర్‌సీటీసీ నిర్వహణలో ఆహారం ఫుడ్‌ట్రాక్ నడుస్తోంది. స్టేషను ప్రాంగణంలో రైల్ కోచ్ రెస్టారెంట్ ఉంది. రైలు బోగీల్లో, రైలు వద్దకు వెళ్లి అమ్మకాలు సాగించేవాళ్లు స్టేషను బయటి నుంచి వండి తెస్తున్నారు. సమోసా, వెజ్, నాన్‌వెజ్ బిర్యానీ, ఎగ్ బిర్యానీ వీళ్లు అమ్ముతుంటారు. మొదటి ప్లాట్‌ఫాంపై ఉండే ఆహారం ఫుడ్‌ట్రాక్ రెస్టారెంట్‌లో దాదాపు అన్ని రకాల టిఫిన్లతోపాటు బిర్యానీ, పెరుగన్నం, పులిహోర వంటివి విక్రయిస్తున్నారు. ప్లాట్‌ఫాంపై అమ్ముతున్నా నిబంధనల ఉల్లంఘన ఎవరికీ కానరావడం లేదు. ప్రతి ప్యాకెట్‌పై కచ్చితంగా పరిమాణం, తయారీ తేదీ, ధర ఉండి తీరాల్సిందే. సాధారణంగా ఈ వివరాలతో ముద్రించిన స్టిక్కర్లు అంటించడం లేదా రబ్బరు స్టాంపు వేయడం చేస్తుంటారు. కానీ, కొన్ని ప్యాకెట్‌లపై అసలు ఎలాంటి వివరాలు కూడా ఉండడం లేదు. దీంతో ప్యాకెట్‌లో ఆహార పదార్థాలు ఎప్పుడు తయారు చేశారు, రైల్వే నిర్ణయించిన ధర ఎంత, పరిమాణం వంటి వేమీ ఉండడం లేదు. ఇక నాణ్యత గురించి పెద్దగా చెప్పాల్సిన అవసరం లేదు. పులిహోరలో నాలుగు కరివేపాకులు, పసుపు రంగు అన్నం తప్ప ఏమీ కానరావు. డబ్బులు చెల్లించి మరీ రుచి లేని ఆహారం కొనుక్కోవడం ప్రయాణికులకు తప్పడం లేదు. అధికారులు వచ్చినప్పుడు వేయింగ్ మిషన్లు పెట్టి మరీ హడావుడి చేస్తూ మభ్యపెడుతూ ఆ తర్వాత షరా మామూలుగానే ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు. రైల్వే ప్రయాణంలో ఆహారం నాణ్యతా ప్రమాణాలతో ఉంటే అద్భుతమే. అలా చేయడానికి రైల్వే అధికారులు గట్టిగానే కృషి చేస్తున్నా పరిస్థితుల్లో మాత్రం చెప్పుకోదగిన మార్పు రావడం లేదు. వ్యాపారస్తులు జరిమానాలైనా చెల్లిస్తున్నారేగానీ తీరు మార్చుకోవడం లేదు. అన్నం విషయంలోనూ అదే తంతు నడుపుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురైనా గుణపాఠం నేర్వడం లేదు. కొద్ది రోజుల కిందట రైలులో విశాఖలో బిర్యానీ కొనుక్కొని తిన్న ప్రయాణికులకు వాంతులు, విరేచనాలు పట్టుకున్నాయి. ఏకంగా 9 మంది అస్వస్థతకు గురయ్యారు. రాజమండ్రి రైల్వే స్టేషనులో దించి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి పంపించారు. సాధారణంగా రైలు వచ్చి ఆగిన తర్వాత దిగి ఆహారం కొనుక్కొని గబగబా రైలు ఎక్కేస్తారు. ఎందుకంటే అధిక శాతం రైళ్లకు ఒకటి నుంచి రెండు నిమిషాల స్టాప్ తప్ప ఎక్కువ సమయం ఉండదు. దీంతో ఆ ప్రయాణికుల పరుగునే ఆసరాగా చేసుకొని వ్యాపారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. రైలులోనూ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. కానీ వాటిపై నమ్మకం లేకపోవడంతో కొందరు స్టేషనులో రైలు ఆగిన తర్వాత ప్లాట్‌ఫాంపై ఉన్న రెస్టారెంట్లలో కొనుక్కుంటారు. అయితే ఇక్కడా ఇష్టానుసారం అమ్మేస్తున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే వ్యాపారులు వాదనకు దిగుతున్నారు. వారితో వాదించే సమయం లేకపోవడంతో ప్రయాణికులు పరుగున రైలెక్కుతున్నారు. దీంతో రైలు ప్రయాణంలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆహారం దొరుకుతుందో చెప్పాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఆహారాన్ని దారిలో పెట్టే పనిలో భాగంగా రైల్వే శాఖ సుమారు మూడు నెలల కిందట రైల్వే క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్ అనే పోస్టు సృష్టించి ఉద్యోగిని నియమించింది. ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలను ఆయన తనిఖీ చేసి ఉన్నతాధికారులకు నివేదించాలి. ఆపై తగు చర్యలు తీసుకొని మరోసారి ఆ తప్పు జరగకుండా చూడాలి. మూడుసార్లు అదే తప్పు జరిగితే లైసెన్సు రద్దు చేయడం వరకూ పరిస్థితి వెళుతుంది. కానీ రోజూ నిబంధనల ఉల్లంఘన కళ్లముందే జరుగుతున్నా జరిమానాలతోనే సరిపెడుతున్నారు. మిగతా సరుకులు ఎలా ఉన్నా ఆహార పదార్థాల విషయంలో తీరు మారడం లేదు. కొన్ని స్టాల్స్ వద్ద ఆహార పదార్థాల ఫొటోలు ఆకర్షణీయంగా ఉంటాయే గానీ ధరల పట్టికలు కూడా కానరాకపోవడం గమనార్హం.

బలహీన వర్గాల సంక్షేమానికి టీడీపీ కృషి

మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బూరుగుపల్లి శేషారావు

నిడదవోలు, జనవరి 13: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేసింది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలులోని నందిన ఆడిటోరియమ్‌లో తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన టౌన్‌హాల్ విత్ లీడర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఐటీ ప్రొఫెషనల్స్ అడిగిన పలు సమస్యలపై సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి పనులు ప్రారంభించామని, ఇప్పుడున్న సంక్షేమ పథకాల కన్నా ఎన్నో రెట్ల ఎక్కువ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే ఇవ్వగలుగుతామన్నారు. పట్టణంలోని ఆర్వోబీ నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే శ్రీకారం చుట్టామని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్‌గా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో కొమ్మిన వెంకటేశ్వరరావు, వెలగన సూర్యారావు, సింహాద్రి రామకృష్ణ, అతికాల రామకృష్ణమ్మ, టీడీపీ ప్రొఫెషనల్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుటూరి కొండయ్యచౌదరి, పలువురు ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన రామారావు



కొవ్వూరు, జనవరి 13: కిర్లంపూడిలో మాజీ మంత్రి, కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను జనసేన పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ముద్రగడ వంటి నాయకులు జనసేనలోకి రావాలని కోరుకుంటున్నానన్నారు. ఆయన వెంట డేగల రాము, కళ్ళేపల్లి ప్రభాత్, గంగుమళ్ళ స్వామి, పోలిశెట్టి శివ, పూటి రమేష్, తదితరులున్నారు.

క్రికెట్ పోటీల విజేత చాగల్లు జట్టు

చాగల్లు, జనవరి 13: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్‌వీఆర్‌కే స్కూల్‌లో జరిగిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో చాగల్లు జట్టు విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఊనగట్ల జట్టు 10 ఓవర్లకు 69 పరుగులు చేయగా చాగల్లు జట్టు ఒక ఓవర్ మిగిలి ఉండగానే టార్గెట్‌ను ఛేదించింది. విజేత జట్టు నియోజకవర్గం స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఊనగట్ల హైస్కూల్ 1987-92 బ్యాచ్ విద్యార్థులు

చాగల్లు, జనవరి 13: మండలంలోని ఊనగట్ల హైస్కూల్లో 1987-92 మధ్య 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం అదే హైస్కూల్‌లో జరిగింది. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా పాల్గొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. పాత స్మృతులను స్మరించుకుంటూ యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పూర్వ ఉపాధ్యాయులు ఆచార్యులు, జి.అప్పారావు, ఎ.సూర్యనారాయణ, జి.నాగమణి తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణ స్కూల్ కమిటీ చైర్మన్ నందిగం శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు నల్లూరి సూరిబాబు, రత్నంరాజు, కె.గోవింద్, కె.సురేంద్ర, ఎ.శివ, రామకృష్ణ, కె.నాగేశ్వరరావు, జి.విజయలక్ష్మి, అన్నపూర్ణ, ముప్పరాజు, వెంకట రమేష్ పాల్గొన్నారు.

పల్లంట్లలో కుంతిదేవి ఉత్సవం

దేవరపల్లి, జనవరి 13: మండలంలోని పల్లంట్ల గ్రామంలో కుంతిదేవి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని బాణసంచా కాల్పులు, మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించి అనంతరం నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అక్కాబత్తుల వెంకటరమణ, వెంకటేష్, చింతాల హరియ్య, చింతాల దాసు, మందలపాటి దశరధుడు, నూతలపాటి రమేష్, బొందల ఏసు పాల్గొన్నారు.

బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారం

దేవరపల్లి, జనవరి13: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో శనివారం స్థానికుడు యాగంటి బుల్లబ్బాయి, రత్నాకుమారి దంపతులు కుమారుడు సుబ్రహ్మణ్యంకు బెల్లంతో తులాభారం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయం వద్ద ఇప్పటివరకూ 600 తులాభారాలు భక్తులు నిర్వహించారని కమిటీ చైర్మన్ సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు కామిశెట్టి దుర్గారావు, యామిని, దుర్గారావు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీలో పండ్లు, దుప్పట్ల పంపిణీ

నిడదవోలు, జనవరి 13: లయన్స్ ఫౌండర్స్ డే సందర్భంగా శనివారం నిడదవోలులోని లెప్రసీ కాలనీలో పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో రంగా సుబ్బారావు, సత్యవతి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్‌ఐ పి.నాగరాజు విచ్చేసి కాలనీవాసులకు దుప్పట్లు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఎస్వీవీ సత్యనారాయణ, గారపాటి శివరామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

అనంతపల్లిలో ఆర్టీసీ బస్‌స్టాండ్

నల్లజర్ల, జనవరి 13: మండలంలోని అనంతపల్లిలో ఆర్టీసీ బస్‌స్టాండ్‌ను శనివారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన బస్‌స్టాండ్‌ను వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేసిందన్నారు. బస్‌స్టాండ్ వద్దకు పాసింజర్ బస్సుల తోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి, సర్పంచ్ కమలకుమారి, ఎంపీటీసీ మార్త, కారుమంచి రమేష్, బంకా అప్పారావు పాల్గొన్నారు

మా వ్యాపారం సంగతి నీకెందుకు

ఎంపీ భరత్‌కు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి ప్రశ్న



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: తమ వ్యాపారాల గురించి మీకేందుకు అని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నేత ఆదిరెడ్డి అప్పారావు.. ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను ప్రశ్నించారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరిలో శనివారంజరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ భరత్ తనకు బిడ్డలాంటివాడని కాని ఇటీవల హద్దులు దాటి వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నాడని, అందుకు తగిన విధంగా పాఠం చెప్పడానికి ఆధారాలతో సిద్ధమౌతున్నామని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, రాజకీయలు, అభివృద్ధిపై మాట్లాడితే సహేతుకంగా సమాధానం చెబుతామని, కాని తమ వ్యాపారాల గురించి ఆయనకెందుకని మండిపడ్డారు. తాను రూ.3 వడ్డీ తీసుకుంటున్నట్టు నిరూపిస్తే వ్యాపారం మూసివేస్తానన్నారు. రూ.500 జీతానికి అధ్యాపకుడిగా పనిచేశానని, సైకిల్ తొక్కానని, తన ముందు భరత్ అనుభవం ఎంతని ప్రశ్నించారు. అనంతరం జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ జియోన్ సంస్థలను నిర్వీర్యం చేయడం, నగరంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపులు, మునిసిపాలిటి నిధులు కేటాయింపులు, ఆర్‌సీఆర్ వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం వంటి పలు విషయాలపై ప్రశ్నలు సంధించారు. ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, బుడ్డిగ రాధా, శెట్టి జగదీష్, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, యిన్నమూరి రాంబాబు, మిస్కా జోగినాయుడు, జనసేన నాయకులు గుత్తుల సత్యనారాయణ, నల్లంశెట్టి వీరబాబు, గుణ్ణం శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

యేసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

ఉండ్రాజవరం, జనవరి 13: మండలంలోని వేలివెన్ను సీఆర్‌పీ చర్చి గోల్డెన్, సిల్వర్ వార్షికోత్సవ సువార్త పండుగల్లో భాగంగా శనివారం రాత్రి అంతర్జాతీయ క్రైస్తవ సువార్త ప్రసంగీకులు ఎమ్.అనిల్‌కుమార్ దేవుని సువార్తను ప్రకటించారు. యేసుక్రీస్తు మానవాళికి అందించిన బోధనలు ఆచరణీయమని, మానవాళికి ఎంతో ప్రయోజకరంగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ చర్చి పాస్టర్ ఎజే సుధాకర్, కన్వీనర్ పెన్నేటి సాల్మన్‌రాజు, వివిధ గ్రామాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి
- పలుచోట్ల సంక్రాంతి ముందస్తు సంబరాలు



కొవ్వూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న బావన రత్నకుమారి

కొవ్వూరు, జనవరి 13: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవలిసిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంతూర్ సోప్స్ సంస్థ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంస్కృత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు అధికసంఖ్యలో పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. న్యాయ నిర్ణేతలుగా మట్టే చైతన్య, ఏచూరి విజయ స్పందన వ్యవహరించారు. విజేతలకు రత్నకుమారి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ, కౌన్సిలర్ పాలూరి నీలిమ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తాడిమళ్ల విజయవాణి, సుభాషిణి, మద్దుల సత్యనారాయణ, వి.ప్రసాద్, పి.రామారావు, హెచ్ఎం జీఎస్ మూర్తి పాల్గొన్నారు. అలాగే 19వ వార్డు ఇందిరమ్మకాలనీలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్న పిల్లలకు భోగిపల్లు పోశారు. భోగి మంటలు వేసి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డేగల రాము, కె.నవ్య, గంగుమల్ల స్వామి, తేజ, అచ్యుతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: త్యాజంపూడిలో జడ్పీ హైస్కూల్ వద్ద డీవైఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు, క్రీడలు ప్రారంభించారు. డీవైఎఫ్ఐ నాయకుడు గారపాటి ప్రసన్నకృష్ణ మాట్లాడుతూ యువత మద్యం, చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉండేందుకు సాంప్రదాయ కీడలను ప్రోత్స హించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుసులూరి వెంకటసతీష్, వ్యాయమోపాధ్యాయుడు బుజ్జిబాబు, డీవైఎఫ్ఐ నాయకులు నాని, తాతారావు, సోమశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ పాల్గొన్నారు.



దేవరపల్లి: త్యాజంపూడిలో క్రీడలు ప్రారంభిస్తున్న దృశ్యం

చర్చలకు పిలిచి బెదిరించడం సరికాదు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు
- 33వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



గోపాలపురంలో సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు

గోపాలపురం, జనవరి 13: చర్చలకు పిలిచి బెదిరింపులకు పాల్పడడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ మూడు దఫాలుగా చర్చల పేరుతో పిలిచి అంగన్వాడీలను బెదిరించడం ప్రభుత్వ నిర్లక్ష్య తీరుకు నిదర్శనమన్నారు. ఒంటెత్తు పోకడ, అధికారం మదంతో తామేమి చేసినా చెల్లుతుందనే ప్రభుత్వ అహంకార ధోరణికి అంగన్వాడీలు రానున్న ఎన్నికల్లో చెక్‌పెడతారన్నారు. ప్రజాసమస్యలపై మాట్లాడేందుకు సజ్జల రామకృష్ణారెడ్డికి ఏ అర్హత ఉందని ప్రశ్నించారు. పది డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్న అంగన్వాడీలను ముఖ్యమైన 6 డిమాండ్లు పక్కన పెట్టి, నాలుగు డిమాండ్లు పరిష్కరించామని గొప్పలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.మాణిక్యాంబ మాట్లాడుతూ చర్చల పేరుతో ప్రధాన డిమాండ్లు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తే గతంలో చంద్రబాబుకు పట్టిన గతే పడుతుందని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్ పుష్పావతి, సుబ్బలక్ష్మి, ఎ.నరసమాంబ, బి.పద్మజ, బి.వసంత, డి.అమరావతి, సీహెచ్.బ్రహ్మమ్మ, వి.శ్రీదేవి, చిన్నలక్ష్మి, ఎం.మంగతాయారు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి సమ్మె శిబిరంలో సోది చెబుతూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. అంగన్వాడీల నియోజకవర్గ నాయకురాలు టీపీ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం సోదిమాటలు మాని తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పద్మకుమారి, మంగతాయారు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: మండల కేంద్రమైన పెరవలిలో అంగన్‌వాడీలు ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు. ఎస్మా చట్టంతో తమను భయపెట్టాలని చూడడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎ.కృష్ణ, నిర్మల, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మెచేస్తున్న అంగన్వాడీలు



దేవరపల్లిలో సోదిచెబుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

- దేవరపల్లి ట్రైనీ డీఎస్పీ భానోదయ
- పలుచోట్ల అవగాహన సదస్సులు.. బరులు ధ్వంసం

దేవరపల్లి, జనవరి 13: కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరపల్లి ట్రైనీ డీఎస్పీ భానోదయ, ఎస్‌ఐ శ్రీహరిరావు హెచ్చరించారు. మండలంలోని శనివారం దేవరపల్లి, యర్నగూడెం, చిన్నాయిగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించే ప్రదేశాలు గుర్తించామని, కొన్ని చోట్ల పందేలకు సిద్ధం చేస్తున్న బరులు ధ్వంసం చేశామని, కోడిపందేల నిషేధ బోర్డులు ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, గుండాట, పేకాట, మద్యం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొవ్వూరు: కొవ్వూరులోని వివిధ ప్రాంతాల్లో కోడి పందాలు, గుండాట, పేకాట వంటి జూద క్రీడలు నిషేధంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సీఐ వి.జగదీశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు పట్టణ, మండలంలో జూద క్రీడలు నిషేధమని, యువత అలాంటివి ఆడి పోలీసు కేసుల్లో చిక్కుకుని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. పండుగ ముసుగులో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జీవీవీ సత్యనారాయణ, ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్, హెచ్‌సీ ఆర్.సత్యనారాయణ, అనీల్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కోడి పందేలు నిర్వహించవద్దని రెవెన్యూ అధికారుల సహాయంతో అవగాహన సదస్సులు, ఫెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పండుగ పేరుతో జూదం, కోడిపందేల్లో బెట్టింగ్ కాసి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. సాంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్, క్రికెట్‌పై దృష్టి పెట్టాలన్నారు. సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ టీవీ సురేష్ ఉన్నారు.

గోపాలపురం: మండలంలో రహస్య ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరులకు సంబంధించిన టెంట్లను ఎస్‌ఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి పడగొట్టి బరులు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేశారు. సంక్రాంతి ముసుగులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.



దేవరపల్లిలో నిషేధ బోర్డు ఏర్పాటుచేసిన పోలీసులు, అధికారులు



గోపాలపురంలో కోడిపందేల కోసం వేసిన టెంట్లు పడగొడుతున్న పోలీసులు



కొవ్వూరులో కోడి పందేల నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీశ్వరరావు

షర్మిళారెడ్డిని కలిసిన హౌసింగ్ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన మేడపాటి షర్మిలారెడ్డిని జిల్లా హౌసింగ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం హౌసింగ్ ఈఈ రాజ్‌కుమార్, రూరల్ డీఈ బీవీవీ సత్యనారాయణమూర్తి, నిడదవోలు డీఈ చంద్రశేఖర్, అనపర్తి డీఈ సీహెచ్ వేణుగోపాల్, రాజానగరం డీఈ ఆర్.వెంకటేశ్వరబాబు, కొవ్వూరు డీఈ ఎం.శ్రీనివాస్, గోపాలపురం డీఈ కె.శేఖర్‌బాబు, ఏఈ కేఎస్ చక్రవర్తి.. షర్మిళారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

జనసేన నేత దుర్గేష్‌కు సతీవియోగం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల లక్ష్మీదుర్గేష్‌కు సతీవియోగం సంభవించింది. ఆయన భార్య కందుల ఉషారాణి(53) కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఉషారాణి భౌతికకాయం రాత్రి రాజమహేంద్రవరం చేరుకుంది. ఆదివారం ఉదయం 10.00గంటలకు ఇన్నీసుపేట కైలాసభూమిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శనివారం ఉదయమే దుర్గేష్‌కు ఫోను చేసి పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, టీడీపీ నాయకులు గన్ని కృష్ణ, ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వైశ్రీను, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావులు ఉషారాణి మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న విక్టర్‌ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13: దేశానికి ఆదర్శంగా విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కుల,మత,ప్రాంతీయ భేదాలు లేకుండా తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం జరుగుతుందని, అలాగే అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్, ఫౌంటెన్లు, మూడువేల మంది కూర్చునే మల్టీపర్పస్ కన్వెన్షన్ హాలు, 2వేల మంది కూర్చునే ఓపెన్ థియేటర్, పదివేల పుస్తకాలతో కూడిన లైబ్రరీ, అంబేడ్కర్ చరిత్రను భావితరాలకు తెలిపేవిధంగా గొప్పకళాఖండాలను సీఎం జగన్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 19 రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను పండుగ వాతావరణంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎం.సందీప్, ఎస్సీఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, జైభీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు కె.భానుచందర్, ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, దళిత మహిళా అధ్యక్షురాలు పి.బేబిప్రశాంతి, దళిత నాయకుడు వియ్యపు, సుందరపల్లి అనిల్, నక్క విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలి: ఎస్పీ



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎస్పీ జగదీశ్

కడియం, జనవరి 13: సంక్రాంతి పండుగ సందర్భంగా యువత జూద క్రీడల వైపు కాకుండా సాంప్రదాయ క్రీడల్లో పాల్గొనాలని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ తిలక్ పర్యవేక్షణలో కడియం పోలీస్‌స్టేషన్ వద్ద రెండు రోజుల పాటు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. యువత జూదాలకు దూరంగా ఉండాలని, క్రిమినల్ కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్‌లో ఉద్యోగవకాశాలు కోల్పోతారన్నారు. కోచ్ ఎన్వీ భద్రంను సత్కరించారు.

విజేతలు వీరే.. బీజీ సాయి, పి.ప్రవీణ్ (కాకినాడ), జి.సాయి మనీష్, ఎస్‌కే నవాబుల్లా(కాకినాడ), జీవీ చైతన్య కె.చైతన్య(రాజమహేంద్రవరం), నున్నా సూర్య, తోట స్వామి (వేమగిరి), గోరు బాబు, సాయి(కడియపులంక), వెంకట్, శ్రీధర్(ధవళేశ్వరం), అంజి, బాబి(కడియం) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్, ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్లో సంక్రాంతి శోభ



రాజానగరంలో విక్రయానికి ఉంచిన ఆవుపిడకలు, పూలు, రేగిపండ్లు

రాజానగరం, జనవరి 13: మండల కేంద్రమైన రాజానగరం మార్కెట్ శనివారం సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఆదివారం భోగి పండుగ కాడంతో చిన్నారులకు భోగిపండ్లు పోసేందుకు(రేగుపండ్లు), ఆవుపేడ పిడకలు దండలు, చెరుకు గెడలు, పలు రకాల పండ్లు, బంతి, చామంతి, గులాబి తదితర వివిధ రకాల పుష్పాలతో రాజానగరంలోని దుకాణాలు రద్దీగా మారాయి. ధరలు ఆకాశన్నంటడంతో వీటిని కొనుగోలు చేసేందుకు సామాన్యులు విలవిలలాడిపోతున్నారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం

బలభద్రపురంలో ఘనంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి చక్ర స్నానానికి బిందెలతో జలాలు తెస్తున్న ముత్తయిదువులు

బిక్కవోలు, జనవరి 13: బలభద్రపురంలో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5 నుంచి నిర్వహిస్తున్న స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో గ్రామం మార్మోగింది. ఉదయం స్వామి అమ్మవార్లకు పండితులు సుప్రభాత సేవ, తోమాల సేవ జరిపారు. తిరుపతి నుంచి తీసుకొచ్చిన పంచెను కొవ్వూరి సతీష్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు స్వామికి అందజేశారు. 108 మంది ముత్తయిదువులు కోనేరు నుంచి తీసుకొచ్చిన జలాలతో స్వామికి చక్రస్నానం జరిపారు. ఆపై పూర్ణాహుతి, గోదాదేవి కల్యాణం నిర్వహించారు. మండ వెంకటరెడ్డి, బృందావతి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీప్రభావతి దంపతులు రూ.24 లక్షలతో తయారు చేయించిన రథంపై స్వామి అమ్మవార్లను పురవీధులగుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలోని కోనేరులో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం జరిపారు. పండిత సత్కారాలతో కార్యక్రమాలు ముగించారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన మాజీ ఎంపీ మురళీమోహన్



మాగంటి మురళీమోహన్‌కు మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

కడియం, జనవరి 13: కడియపులంక సత్యదేవానర్సరీని శనివారం సినీనటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు(అబ్బులు) మొక్కను అందజేసి స్వాగతం పలికారు. మురళీమోహన్ నర్సరీలో వివిధ రకాల మొక్కలను, సంక్రాంతి సందర్భంగా మొక్కలతో తీర్చిదిద్దిన ఆకృతులను తిలకించారు. మొక్కలు, వాటి శాస్త్రీయనామాలను అబ్బులు తనయులు వీరబాబు, రాజశేఖర్‌లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని రకాల మొక్కలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పలువురు నర్సరీరైతులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	గుంటూరుకారం
వై.స్ర్కీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	గుంటూరు కారం
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్